జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 12 సంచిక 213 విశాఖపట్నం | మంగళవారం 20 ఏప్రిల్ 2021 | 8 పేజీలు | వెల : 5.00



## ఏపీలో స్కూళ్లకు సెలవులు

అమరావతి,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుత పరిస్థితులపై సీఎం జగన్ సమీక్షించారని... రాబోయే రోజుల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారన్నారు. కరోనా వ్యాప్తి చెందకుండా నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి క్లాసులను రద్దు చేస్తున్నామని.. వారందరికీ మంగళవారం నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉంటే, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయన్నారు. వాటి షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని... ప్రస్తుతానికి ఆ నిర్ణయానికే కట్టుబడి ఉన్నామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ తరగతులను భౌతిక దూరం పాటిస్తూ.. కరోనా నిబంధనలను అనుసరిస్తూ... నిర్వహించాలని సూచించారు.

# పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువు:జగన్

- చదువుతోనే మన రూపురేఖలు మారుతాయి
- విద్యా దీవెన ద్వారా 10.88లక్షల మంది పిల్లలకు లబ్ధి
- పిల్లల ప్రతి అడుగులో ప్రభుత్వం తోడుగా ఉంది
- 'విద్యాదీవెన' కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్
- ఆన్‌లైన్ ద్వారా తల్లుల ఖాతాల్లో 'జగనన్న విద్యాదీవెన' నగదు జమ చేసిన సీఎం






అమరావతి,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్‌లో విద్యాదీవెన మొదటి కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని.. 14న అంబేద్కర్ జయంతి ఘనంగా జరుపుకున్నామన్నారు. 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద 2020%--%21 ఫీజు రీయింబర్స్‌మెంట్ మొదటి విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, విద్యా దీవెన ద్వారా 10.88లక్షల మంది పిల్లలకు లబ్ధి చేకూరుతుందన్నారు. "2018-19లో బకాయిలు ఉన్న రూ.1800 కోట్లను మన ప్రభుత్వమే చెల్లించింది. 2019-20 ఏడాదికి పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేకుండా చేశాం. ఏ ఏడాది ఫీజు రియింబర్స్‌మెంట్‌ను అదే ఏడాదిలో చెల్లిస్తున్నాం. నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నాం. ప్రతి త్రైమాసికంలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీలుగా మార్చాం. నాడు-నేడుతో స్కూళ్ల రూపురేఖలను మార్చుతున్నాం. పిల్లల ప్రతి అడుగులో ప్రభుత్వం తోడుగా ఉంది. పిల్లల తల్లులకు ప్రభుత్వం తరఫున లేఖలు కూడా రాశాం. వసతి దీవెన కూడా ఎప్పుడు ఇస్తామన్నది (మిగతా 2లో..)

## కోవిడ్ వ్యాక్సిన్‌పై పుకార్లను నమ్మొద్దు:ఏపీ ఆరోగ్యశాఖ




అమరావతి,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ వ్యాక్సిన్‌పై పుకార్లను నమ్మొద్దని ఏపీ ఆరోగ్యశాఖ అధికారులు అన్నారు. కోవ్యాక్సిన్ అనేది ఉత్తేజం లేని వ్యాక్సినే తప్ప శక్తి లేనిది కాదని వ్యాఖ్యానించారు. కోవిషీల్డ్ అనేది వైరల్ వెక్టార్ వ్యాక్సినే కానీ శక్తి లేనిది కాదన్నారు. ఈ రెండు వ్యాక్సిన్లలో ఏ ఒక్కటీ కరోనా పాజిటివ్‌కు దారి తీయవని చెప్పారు. వ్యాక్సినేషన్ తరువాత ఆర్టీపీసీఆర్‌లో పాజిటివ్ నిర్ధారణ అయితే.. వారిలో కోవిడ్ వ్యాధి ఉనికి ఉందని అర్ధమన్నారు. అంతేకానీ వ్యాక్సినేషన్ కారణంగా పాజిటివ్ వచ్చినట్లు కాదని వివరించారు. వ్యాక్సినేషన్ తర్వాత జ్వరం వస్తే ఆందోళన చెందొద్దని ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు.

## బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత పర్యటన రద్దు




న్యూఢిల్లీ,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలో కరోనా మహమ్మారి రోజురోజుకు చెలరేగిపోంది. ప్రతిరోజు లక్షలాది కేసులు నమోదవుతున్నాయి. చాలావరకు రాష్ట్రాలు ఆంక్షలు విధించి వైరస్ కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. దేశం వేగంగా కరోనా కోరల్లోకి జారుకుంటుండడంతో ఈ నెల 25న భారత పర్యటనకు రావాల్సిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. పర్యటనకు బదులుగా వర్చువల్ పద్ధతిలో భారత ప్రధాని మోదీతో సమావేశమై ఇరు దేశాల మధ్య భవిష్యత్ భాగస్వామ్యం గురించి చర్చిస్తారు. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. కరోనా వైరస్ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత్‌లో పర్యటించడం లేదని, వర్చువల్ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరుపుతారని పేర్కొంది. ఇరు దేశాల భాగస్వామ్యానికి రెండు దేశాధినేతలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ ఏడాది చివర్లో జాన్సన్, మోదీలు ఇద్దరూ వ్యక్తిగతంగా సమావేశమవుతారని విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తెలిపారు. (మిగతా 2లో..)

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు..!

ముంబై,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలప్పుడు సెన్సెక్స్ 1,250 పాయింట్లు కోల్పోయి 47,581 వద్ద కొనసాగుతుండగా.. నిఫ్టీ 350 పాయింట్లు నష్టపోయి 14,267 వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.74.65 వద్ద కొనసాగుతున్నది. నిఫ్టీలో విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సిప్లా షేర్లు లాభాల్లో పయనిస్తుండగా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫినాన్స్ లిమిటెడ్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్ని చవిచూస్తున్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని కంపెనీలు నష్టాల్లో పయనిస్తున్నాయి.

## చట్టీ ఘటనను ఖండించిన వాసిరెడ్డి పద్మ

**మృగంలా ప్రవర్తించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలి**

**ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్**



అమరావతి,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: తూర్పుగోదావరి ఏజన్సీ చింతూరు మండలం చట్టి ఘటనను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఖండించారు. మృగంలా ప్రవర్తించిన భర్త కళ్యాణం వెంకన్నను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆమె ఆదేశించారు. బాధిత మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఘటనపై జిల్లా ఎస్పీ నయీం హస్మీతో వాసిరెడ్డి పద్మ మాట్లాడారు. తన ఇద్దరు భార్యలు సుమతి, జయమ్మలపై భర్త కళ్యాణం వెంకన్న చేసిన పాశవిక దాడి అమానుషమన్నారు. ఇద్దరిని పెళ్లాడటం తప్పు అని.. అనుమానాలతో భార్యలపై మృగంలా ప్రవర్తించి అత్యంత క్రూరంగా చిత్రహింసలకు గురిచేయడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భార్యలను చిత్రహింసలు పెడుతూ మరో వ్యక్తితో సెల్‌లో వీడియో తీయించడం మరీ దారుణమన్నారు. ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు, యువతులు ధైర్యంగా ముందుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## 'ఆ దంపతుల మృతి నన్ను కలిచి వేసింది'



అమరావతి,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: పంచాయతీరాజ్ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసే శాంతకుమారి దంపతులు కరోనాతో చనిపోవడం పట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రెండ్రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరు కరోనాతో చనిపోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందని పెద్దిరెడ్డి అన్నారు. వీరిద్దరు కూడా ఏపీ సచివాలయంలోనే ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఈ మహమ్మారి మొదట శాంతకుమారి భర్తకు సోకింది. ఆయన, ఆసుపత్రిలో ఉండి చికిత్స తీసుకున్నప్పటకి ప్రాణాలు దక్కలేదు. తాజాగా, శాంతకుమారి కూడా కరోనాతోనే చనిపోయింది. వీరి కుటుంబానికి పెద్దిరెడ్డి రామచం?ద్రారెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## 90 రోజుల వరకు శ్రీవారి దర్శన అవకాశం

తిరుమల,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్ బుక్ చేసుకుని ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు తిరుమల శ్రీవారి దర్శనానికి రావాల్సిన భక్తులు.. కోవిడ్ కారణంగా రాలేని పరిస్థితుల్లో ఉంటే వచ్చే 90 రోజుల వరకు వారు దర్శన అవకాశాన్ని వినియోగించుకోవచ్చని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది. కోవిడ్ కేసులు పెరిగిన నేపథ్యంలో టీటీడీ పలు నిర్ణయాల ను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే తిరుపతిలో సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్ల జారీని నిలిపేసింది. దగ్గు, జలుబు వంటి సమస్యలతో బాధపడే భక్తులు తిరుమల యాత్రను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.





# జగనన్న విద్యా దీవెనతో పేద విద్యార్థులకు భరోసా:ఎమ్మెల్యే సింహాద్రి రమేష్



అవనిగడ్డ, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకంతో పేద విద్యార్థుల జీవితాలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం విద్యా దీవెన పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యా దీవెన పథకం ద్వారా మొదటి క్వార్టర్లో 6,846 మంది విద్యార్థులకు రూ. 4.47 కోట్లు తల్లులు ఖాతాలో జమ అయినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు ఆగిపోకూడదు అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో పేదలు చదువుకునేందుకు పలు ఇబ్బందులు పడేవారని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా వారి కష్టాలు తొలగిపోయాయని అన్నారు. ఉన్నత స్థితికి చేరుకోవాలనుకునే వారు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలన్నారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పని ఉంటే తప్ప ఎవరూ బయటకు రావద్దని, బయటకు వచ్చినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, శానిటేషన్ తప్పని సరిగా చేసుకోవాలన్నారు. ఇన్చార్జి ఏ.ఎన్.డబ్ల్యూ.వో. గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకల్లు నరసింహారావు, డిఎస్పి మహబూబ్ బాషా, తాసిల్దార్ బి శ్రీను నాయక్, ఎంపీడీవో బి. ఎం. లక్ష్మికుమారి, సి.ఐ రవికుమార్ పలువురు వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.





## ఉగాది వెళ్ళిపోయింది.. శ్రీరామనవమి పండుగ వస్తుంది...!

**- పండుగ రోజు లలో పస్తులున్నా పట్టించుకోరా..?**

**- నేడు ఈనెలలో 19వరోజు, నేటికి ఆర్టీసీవారు దీక్షలు ప్రారంభించి 29రోజులు**

**- నిర్లక్ష్యం వీడని యాజమాన్యం, కనీస స్పందన కరువు**

చీరాల (ఒంగోలు),ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: ఉగాది వెళ్ళిపోయింది.. శ్రీరామనవమి పండుగ వస్తుంది..., కనీసం అప్పటికైనా యాజమాన్యం తమ వైఖరి మార్చు కుంటుందేమో, అన్న ఆశతో ఆర్టీసీ ఉద్యోగులు, రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే ఉన్నారు.సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టి నేటికి 29 రోజులైంది.ఉగాది పండుగ రోజు కూడా పట్టుదల వీడకుండా దీక్షలు కొనసాగిస్తూనే ఉన్నారు.కానీ పండుగ పూట పస్తులున్నారని తెలిసినా, యాజమాన్యం వైపు నుండి కనీస స్పందన లేకపోవడం దారుణం. యాజమాన్యం ఇలానే నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే, ఉద్యమం ఉధృతం చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హెచ్చరిస్తున్నారు. చీరాల డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో, జరుగుతున్న 29రోజురిలే నిరాహార దీక్షను, కండక్టర్లు పిర్ల శ్రీనివాస్ యాదవ్, పొలగం.బిక్షాలు లు చేపట్టారు. ఈ నిరాహార దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి, డిపో గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ ఏ.బాబు రావు ప్రసంగించారు .మరియు డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎలీషా కె.వి రావు, అసిస్టెంట్ సెక్రటరీ కె.యస్.రావు, డిపో కోశాధికారి పి.రవి, జి సాయిబాబా,కె సంజీవయ్య ,ఏ.సుగుణరావు, మరియు గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు జి రమేష్ ,ఎం.మురళి ,కొండలు ,రహంతుల్లా ,సింగ్,మొదలగు వారు పాల్గొన్నారు.

## కాపు నాయకుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న సుంకర సాయిబాబా



ఒంగోలు,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: కాపు నాయకుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఆంధ్ర రాష్ట్ర గౌరవ సలహాదారులు సుంకర సాయిబాబా మరియు రాష్ట్ర కన్వీనర్ మరియు రాయలసీమ ఇంచార్జీ చందు శ్రీనివాస్, మరియు కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు అర్కుట్ ప్రసాద్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి మెరుపుల మహేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.. ఈ కార్యక్రమం లో కాపు సంక్షేమ సేన సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశాలు గురించి మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు రాయిని రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు మెడ్డిశెట్టి సుబ్బారావు, మరియు జిల్లా యువసేన అధ్యక్షులు జొన్న వెంకట్, ఉపాధ్యక్షులు గోలకారం మనోజ్ కుమార్, మరియు ఒంగోలు నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షులు సింగరాజు పవన్ తేజ, ప్రకాశం జిల్లా లోని అన్ని నియోజకవర్గాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాపు నాయకులు, పాల్గొన్నారు.

## "నిరుపేదలకు సాయం" గంటా అంజిబాబు

బాపట్ల ప్రజాపాలన ప్రతినిధి :-సేవ్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంఛార్జ్ గంటా అంజిబాబు సహకారం తో కోవిద్ మెడిసిన్ కిట్లను డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి చేతులు మీదుగా నిరుపేదలు కు కరోనా పాజిటివ్ వచ్చి చూపించుకోలేని వారికి వాలంటర్ ల ద్వారా కిట్లు ను పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దోనెపూడి దేవరాజ్. ఎస్ వి ఆర్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.....



## గోపిరెడ్డి చారిటీస్ తరపున డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వృద్దునికి ట్రై సైకిల్ వితరణ






నరసరావుపేట, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:రొంపిచెర్ల మండలం ఎమ్మెల్యే స్వగ్రామమైన బుచ్చిపాపన్న పాలెం గ్రామానికి చెందిన తొండెపు రామారావు అనే వృద్దుడు కాళ్ళు రెండు సహకరించక తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకోలేకపోతున్న తరుణంలో నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ని సహాయార్థం అభ్యర్థించగా ఎమ్మెల్యే లిగోపిరెడ్డి చారిటీ తరపున దాత ఆకుల సాంబశివరావు భార్య గిరిజాసుధ ద్వారా బత్తుల విష్ణు వర్ధన్ ప్రోత్సాహకంతో నేడు పార్టీ కార్యాలయం నందు వృద్దునికి వితరణ చేయటం జరిగింది.ఈ సందర్భంగా శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సహాయార్థం వచ్చే వారికి తప్పకుండా గోపిరెడ్డి చారిటీస్ తరపున ఆదుకుంటామని.ఇప్పటివరకు దాదాపు 58 కి పైగా ట్రై సైకిల్ లను గోపిరెడ్డి చారిటీస్ ద్వారా వితరణ చేశామని తెలియజేసారు. తప్పకుండా భవిష్యత్తు లో చారిటీస్ తరపున ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేపడతామని తెలియజేసారు.ఈ ట్రైసైకిల్ ల వితరణలో గత 4 ఏళ్ల నుండి సహాయం చేస్తున్న బత్తుల విష్ణు వర్ధన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సరస్వతీ నిలయం జాండ్రపేట హైస్కూల్

**- హెచ్.ఎం. వెంకట్రావు పర్యవేక్షణ ప్రశంసనీయం**


**- పాఠశాలకు మైక్ సెట్ అందజేసిన పూర్వ విద్యార్థి**

**- ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది శ్రద్ధ అభినందనీయం**



చీరాల (ఒంగోలు),ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: జాండ్రపేట బి.వి.అండ్ బి.యన్. హైస్కూల్ సరస్వతీ నిలయం అని, ప్రధానోపాధ్యాయులు బట్టావెంకట్రావు, స్కూల్ ని సొంత ఇల్లు లా భావించి, పర్యవేక్షించే తీరు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. 1985 పదోతరగతి బ్యాచ్ విద్యార్థి ఆరికాటి బాబు, తన తల్లి దేవకీదేవి జ్ఞాపకార్థం, తండ్రి ఆరికాటి గాంధీ చేతుల మీదగా, పాఠశాలకు రూ.50,000 విలువచేసే అహుజా మైక్ సెట్ బహుకరించారు. తాను చదివిన పాఠశాలకు, తన వంతు చేయూతను అందించడమే లక్ష్యంగా, పాఠశాలలో అసెంబ్లీ నిర్వహణ, పేరెంట్స్ కమిటీ నిర్వాహణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, ఉపయోగకరంగా ఉండేందుకు గాను, మైక్ సెట్ ను అందజేసినట్లు దాత, పూర్వ విద్యార్థి ఆరికాటి బాబు పేర్కొన్నారు. హైస్కూల్ కరస్పాండెంట్ బీరక కాశీనాథ్ కు, రూ. 50వేల విలువ చేసే మైక్ సెట్ ను , తన తల్లి దేవకీదేవి జ్ఞాపకార్థం, తండ్రి గాంధీ చేతుల మీదుగా అందజేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ , విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయే తర సిబ్బంది చూపే శ్రద్ధ అభినందనీయమని, పదో తరగతి పరీక్ష ఫలితాలలో, పలుసార్లు మండల స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ ప్రతిభను చాటుకున్న ఘనత జాండ్రపేట హై స్కూల్ ది కావటం తమకు గర్వంగా ఉందన్నారు.ఈ కార్యక్రమం లో సెక్రటరీ పన్నెం మల్లిఖార్జునబాబు, ప్రధానోపాధ్యాయుడు బట్టావెంకట్రావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పన్నెం వెంకటేశ్వరరావు, 1985 య స్.య స్.సి. బ్యాచ్ విద్యార్థులు నందం వీరాంజనేయులు, రాచాబత్తుని యల్లమందేశ్వరరావు, లేళ్ళ త్రివిక్రమ్, నాసిక జగదీష్, గుత్తి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ సంక్షేమ పథకంలో కొత్తగా చేరిన 15 మంది సభ్యులు



చీరాల (ఒంగోలు),ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యులుగా చేర్చుటకు, పట్టణంలోని పలు మున్సిపల్ మరియు ఎయిడెడ్ పాఠశాలల్లో,యుటిఎఫ్ నాయకులు క్యాంపెయిన్ నిర్వహించగా, సుమారు 15 మంది ఈ పథకంలో కొత్తగా సభ్యులుగా చేరారు. జిల్లా కార్యదర్శి షేక్ జానీబాషా మాట్లాడుతూ, యుటిఎఫ్ వ్యవస్థాపక నిర్మాత స్వర్గీయ దాచూరి రామిరెడ్డి ప్రారంభించిన కుటుంబ సంక్షేమపథకం ద్వారా, అకాల మరణం చెందిన ఉపాధ్యాయుని కుటుంబానికి, సంఘీభావ విరాళంగా 1,50,000 రూపాయలు అందిస్తున్నామని, ఇప్పటికే సుమారు ఒక కోటి యాభై లక్షలు విరాళంగా చెల్లించియున్నామని తెలిపారు. ఇప్పటికే పట్టణ శాఖ లో 72 మంది సభ్యులుగా ఉండగా, కొత్తగా చేరిన 15 మందితో కలుపుకుని, 87 మంది ఈ పథక సభ్యులు ఉన్నారని తెలిపారు. యుటిఎఫ్ పట్ల విశ్వాసం ఉంచి, మద్దతుగా నిలుస్తున్న ఉపాధ్యాయులందరికీ ఉద్యమ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్.రాజేష్ ,ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువు:జగన్

(మొదటి పేజీ తరువాయి)

లేఖలో రాశామని" సీఎం వైయస్ జగన్ పేర్కొన్నారు.మొదటి విడత కింద 10,88,439 మంది విద్యార్థులకు సంబంధించిన రూ.671.45 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వారి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఇందుకోసం ఆర్థిక శాఖతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలు రూ.671.45 కోట్లను విడుదల చేస్తూ ఆదివారం జీవోలు జారీ చేశాయి. బీసీ సంక్షేమ శాఖ రూ.491.42 కోట్లను జగనన్న విద్యాదీవెన మొదటి విడత కోసం విడుదల చేసింది. ఇందులో బీసీ విద్యార్థులతో పాటు ఈబీసీ, కాపు విద్యార్థులు ఉన్నారు. ఎస్సీ విద్యార్థుల కోసం ఎస్సీ సంక్షేమ శాఖ రూ. 119.25 కోట్లు, ఎస్టీ విద్యార్థుల కోసం ఎస్టీ సంక్షేమ శాఖ రూ.19.10 కోట్లు, మైనారిటీ సంక్షేమ శాఖ రూ.41.68 కోట్లు విడుదల చేసింది.

## బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత పర్యటన రద్దు

(మొదటి పేజీ తరువాయి)

జాన్సన్ పర్యటన నిజానికి ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు జరగాల్సి ఉండగా, పర్యటనను కుదిస్తున్నట్టు గతవారం జాన్సన్ కార్యాలయం ప్రకటించింది. భారత్‌తో ద్వైపాక్షి సంబంధాల గురించి చర్చించేందుకు ఆన్‌లైన్‌లో సమావేశమైతే సరిపోతుందంటూ ప్రతిపక్షాల నుంచి ఇటీవల తీవ్రమైన ఒత్తిడి రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని, ప్రయాణాలు పెట్టుకోవద్దని చెబుతున్న ప్రధాని.. ఆయన మాత్రం భారత ప్రధానిని ఆన్‌లైన్‌లో ఎందుకు కలవకూడదని లేబర్ పార్టీకి చెందిన షాడో కమ్యూనిస్ట్ సెక్రటరీ స్టీవ్ రీడ్ దుమ్మెత్తి పోశారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో జాన్సన్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని పూజలు



అవనిగడ్డ, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కోవిడ్ నుండి కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగిరావాలని కోరుతూ అవనిగడ్డ జనసేన పార్టీ నాయకులు అవనిగడ్డ గ్రామదేవత శ్రీ లంకమ్మ అమ్మవారి దేవస్థానంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రార్థించారు. జనసేన పార్టీ మాస్టర్ ట్రైనర్ రాయపూడి వేణుగోపాల్ మాట్లాడుతూ తమ అధినేత పవన్ కళ్యాణ్ కి కోవిడ్ పాజిటివ్ అనే వార్త ఎంతో బాధకలిగించింది అని, నియోజకవర్గంలో ఉన్న జనసైనికులు అందరూ కూడా పవన్ కళ్యాణ్ పూర్తి ఆరోగ్యంతో తిరిగిరావాలని కోరుతూ సర్వమత ప్రార్ధనలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బచ్చు వెంకటనాధ్, కోడూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి సిద్దినేని అశోక్ నాయుడు, రాజనాల వీరబాబు, పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు రైతు ఖాతాల్లోకి వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ జమ:ఏ.డి.ఏ.

పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి: 2019-20 రబీ లో పొన్నూరు సబ్ డివిజన్ కు సంబంధించి 7040 మంది రైతులకు రూ. 96,90,206.19/- మంగళవారం 20 తేదీన రాష్ట్ర ప్రభుత్వం రైతు ఖాతాల్లోకి వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ జమ చేయనున్నట్లు పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సి. హెచ్. తిరుమల దేవి ఒక ప్రకటన లో తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు సకాలం లో రుణం చెల్లించిన వారికి, వారు కట్టీన 4 శాతం వడ్డీని ఈ నెల 20న నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలియజేశారు. అయితే యస్. వి. పి. ఆర్. పోర్టల్ లో బ్యాంకర్లు అప్ లోడ్ చేసిన ప్రతి ఒక్క రైతుకి వైఎస్సార్ సున్నా వడ్డి రాయితి అందనుంది. కావున నేటి నుంచి లబ్ది దారుల లిస్టుని వారి వారి రైతు భరోసా కెంద్రాల వద్ద కూడా చూడగలరని తెలియజేశారు.

## ఘనంగా వైయస్ విజయమ్మ జన్మదిన వేడుకలు



నందిగామ ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:నందిగామ పట్ట ణంలోని పార్టీ కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు వైయస్ విజయమ్మ జన్మ దినం సందర్భంగా పార్టీ నాయకులు ,మహిళా నేతల తో కలిసి శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం తన కుటుంబానికి ఎదురైన ఇబ్బందులను ,ఆటుపోట్లను ఎదుర్కొంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు నుండి అధికారంలోకి వచ్చే వరకు తన కుమారుడు వైఎస్ జగన్ కు, రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ అభిమానులు అండగా వైయస్ విజయమ్మ ఎంతో గొప్ప పాత్ర పోషించారని తెలిపారు ,రాష్ట్రంలో ఎంతో మంది మ హిళలకు ఆదర్శమూర్తిగా నిలిచిన వైయస్ విజయ మ్మ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు ,ఆమె నిండు నూరేళ్ళు చల్లగా సుఖ సంతోషాలతో జీవించాలని ఆ కాంక్షించారు ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొ న్నారు



## అమ్మవారి బోనాలు చెల్లింపు

పెనుగంచిప్రోలు ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:పెనుగంచిప్రో లు గ్రామంలోని ఈ రోజున శ్రీ తిరుపతమ్మ దేవస్థానం వద్ద నిర్వహించినషాపింగ్ కాంప్లెక్స్ బొమ్మలు అం డ్ ఫ్యాన్సీ దుకాణదారులు అందరూ ప్రతి సంవత్సరం నిర్వహించే అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని ఈ సం వత్సరం కూడా దుకాణదారులుఅమ్మవారికి బోనాలు చెల్లించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి రాష్ట్ర వైఎస్ఆ ర్సిపి బీసీ నాయకులు చేని రాంబాబు ముఖ్య అతి థులుగా పాల్గొని ముత్యాలమ్మ తల్లి కి తిరుపతమ్మ అమ్మవారి బోనాలు చెల్లించారు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గుర్రాల వెంకటేశ్వర్లు .కొత్త కుంట్ల అజయ్. దా రా రాజు. పోన్నం హైమావతి .యడ్ల గంగరాజు. బొడ్డు రవి. బొడ్డు రమాదేవి. వీర గుత్తుల స్వామయ్య చెరుకూరి శ్రీనివాస్ .దారవెంక టేశ్వర్లు .పొన్నం సత్యం. ముదరకొల కుటుంబరావు. ముదరకోల కళావతి. నెమలిపురి ఏసోబు శ్రీకాంత్. పోన్నం మహేష్. పోన్నం శ్రీను. ముంగీ గోపాలస్వామి .ముల్లపాటి శ్రీను. కొబ్బరి గిరి లక్ష్మి .కత్తుల వెంకట రమణతదితరులు పాల్గొని సంబరాలతో అమ్మవారికి బోనాలు చెల్లించి మా దుకాణదారులు నిన్ను చల్లగా చూడాలని కరోనా మహమ్మారి మాకు మా పిల్లలకి మా కుటుంబ సభ్యులందరికీ దేవస్థానానికి వచ్చే భక్తులకు రాకూడదని అమ్మవారిని కోరుకున్నారులి .

## నియోజకవర్గ స్థాయి జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్



నందిగామ ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:నందిగామ ని యోజకవర్గ పరిధిలో 5284 మంది విద్యార్థులకు రూ.3,79,36,957 /- కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమఅయింది పట్టణంలోని జి డి ఎం ఎం కళాశాలలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి జగనన్న విద్య దీవెన కార్యక్రమాన్ని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రారంభించారు ముందుగా ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న వి ద్యా దీవెన కానుక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు ,విద్యార్థులతో కలిసి వీక్షించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చద వాలన్న సమున్నత లక్ష్యంతో దేశ చరిత్రలోనే తొలి సారిగా ఎన్నడ్షు లేని విధంగా అర్హత ఉన్న ప్రతి వి ద్యార్థికి సకాలంలో ఏ బకాయిలు లేకుండా నాలుగు దఫాల్లో పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ చేయడం జరు గుతుందని తెలిపారు అదేవిధంగా ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి 2020-21 విద్యా సంవత్స రం మొదటి విడతగా నేడు 10,88,439 మంది వి ద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా రూ.671.45 కో ట్లను జమ చేయనున్నట్టు తెలిపారు ,సీఎం జగన్ మంచి ముఖ్యమంత్రిగా విద్యార్థుల బంగారు భవిష్య త్తు కోసం బాటలు వేస్తున్నారన్నారు ఈ కార్యక్రమం లో విద్యాశాఖ అధికారులు ,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాల్దీవుల వ్యాక్సిన్ ఆఫర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19, :ద్వీప దేశమైన మాల్దీవ్స్, తమ పర్యాటకులను ఆకర్శించడానికి సరికొత్త ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. అదే వ్యాక్సిన్ ప్యాకేజీని రూపొందించి కొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టిన మొదటి దేశంగా రికార్డు నెలకొల్పింది మాల్దీవ్స్ దేశం. మాల్దీవ్ సందర్శకులను మూడు రోజుల్లోపు పీసీఆర్ నెగెటివ్ వచ్చినవారిని లేదా కోవిడ్ టీకా వేసుకున్న పర్యాటకులకు అనుమతినిస్తోంది.ఇప్పటికే అనేక దేశాల్లో వ్యాక్సిన్ లభిస్తున్నప్పటికీ, కరోనా వైరస్ సెకండ్ వేవ్ అనేక మంది జీవితాలను పీడిస్తోంది. అందుకే సాధ్యమైనంత వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. మాల్దీవ్స్ ప్రయాణం చాలా విలాసవంతమైంది. పర్యాటక రంగాన్ని ఆకట్టుకుని దాన్ని పెండే ప్రయత్నంలో పర్యాటకులకు కొవిడ్ 19 టీకాను అందించే ప్రణాళికను ప్రకటించింది.దక్షిణాసియా ద్వీపసమూహ పర్యాటక మంత్రి అబ్దుల్లా మౌసూమ్, సీఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, దేశాన్ని సందర్శించడానికి ప్రోత్సాహకంగా 'విజిట్', 'వ్యాక్సిన్', 'వెకేషన్' అనే '3 వీ' ప్రణాళికను ప్రకటించారు.పర్యాటక రంగం కనీస అసౌకర్యంతో సురక్షితంగా అందించాలనే ప్రధాన ఉద్దేశంతో తాము దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత 3వీ టూరిజం నిర్ణయంపై ముందుకు వెళ్తామని మౌసుమ్ అన్నారు. మాల్దీవుల ప్రజలు ఎక్కువ శాతం పర్యాటక పరిశ్రమపై ఆధారపడిందని అందుకే ఇక్కడి ప్రజల తర్వాత తమ దేశాన్ని పర్యాటించే టూరిస్టులకు కూడా టీకా ఇవ్వనున్నామని అన్నారు.ఇప్పటికే 90 శాతం మంది ఫ్రంట్లైన్ ఉద్యోగులకు టీకా అందించినట్లు అదే విధంగా సగం జనాభా కనీసం ఒక డోస్ తీసుకున్నారని, జనాభా కూడా తక్కువగా ఉన్నందుకు వ్యాక్సిన్ సరఫరా సమస్య ఉండదని మౌసుమ్ తెలిపారు. వివిధ స్నేహపూర్వక దేశాలు, సంస్థల నుంచి వ్యాక్సిన్ కోటా కూడా దీనికి సహాయపడుతుంది.ప్రధానంగా భారత్ నుంచి ఈ ఏడాది 3,50000 మంది పర్యాటకులు హాలిడే ట్రిప్లో భాగంగా వచ్చారని నివేదిక పేర్కొంది.

# సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలు





బాపట్ల ప్రజాపాలన ప్రతినిధి :గౌడ సంగీయులు జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న గారి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు సీనియర్ నాయకులు మాజీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ తాత జయప్రకాష్ నారాయణ రావు గారు మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న భారతీయ రాజకీయవేత్త స్వాతంత్ర్య సమర యోధుడు బడుగు వర్గాల పోరాట యోధుడు గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పి స్తూభారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు అదేవిధంగా జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ సాహసానికి కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్ సర్దార్ గౌతు లచ్చన్న వి.వి.గిరి నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి ధర్మతేజ మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళాడు ప్రకాశం పంతులు మరియు బెజవాడ గొపాలరెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యాడు చిన్న రాష్ట్రాలు కావాలన్నాడు అదేవిధంగా పరిస రమేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణా కొరకు మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపాడు తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి స్వేచ్ఛ కోసం పోరాడాడు చౌదరి చరణ్ సింగ్ జయప్రకాష్ నారాయణ మసాని లతో పనిచేశాడు.


సర్దార్ గౌతు లచ్చన్న ఆంధ్ర రాష్ట్ర మంత్రిప్రసిద్ధిస్వాతంత్ర్య సమరయోధుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశాడు అని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జై గౌడ ఉద్యమం నాయకులు మాజీ గవర్నమెంట్ హాస్పిటల్ చైర్మన్ కర్పూరపు రామారావు గౌడ్ గౌడ సంఘం పట్టణ అధ్యక్షులు పరిస రమేష్ గౌడ్ జై గౌడ ఉద్యమం నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పల హరికృష్ణ గౌడ్ మాజీ ప్రెసిడెంట్ మునేశ్వర రావు గౌడ్ జై గౌడ ఉద్యమం గౌరవాధ్యక్షులు రమణ కందుల బాబు గౌడ ఎనుముల వెంకటనారాయణ గౌడ మరియు జై గౌడ్ ఉద్యమ నాయకులు పాల్గొన్నారు

## అంతుబట్టని వ్యాధితో అల్లాడుతున్న గ్రామ సింహాలు

### శాఖ పరంగా పట్టించుకోవాలని కోరుకున్న గ్రామాల ప్రజలు

### వింత వైరస్ అంటూ ఆందోళనలో ప్రజలు

బెల్లంకొండ: ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని వివిధ గ్రామాలలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఎక్కువ శాతం కుక్కలకు ఎక్కడ చూసినా చర్మం ఊడి పోయి,శరీరమంతా మచ్చలు,పుండ్లు పడి,ఒళ్ళు జలదరించేలా ఉన్నాయి.ఈ కుక్కలకేమయ్యింది.?అనేది అర్థం కావటం లేదు.ఖచ్చితంగా ఏదో అంతుచిక్కని వ్యాధి బారిన పడి మూగ జీవాలు అల్లాడుతున్నాయి.వీటివల్ల ర్యాబిస్ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.చనిపోయిన రేబిస్ వ్యాధి సోకిన పశువులను, గబ్బిలాల కళేబరాలను కుక్కలు తినడం వలన ఈ వైరస్ కుక్కలకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో కుక్కలు మానసిక స్థితిని కోల్పోయి, విచిత్రంగా ప్రవర్తిస్తాయి. వ్యాధిని గుర్తించకపోవడంతో కొన్ని రోజుల్లో మరణిస్తాయి.పాఠశాలలకు వెళ్ళే చిన్నారులు,రాత్రిపూట ప్రయాణించే వాహనదారులను వెంటపడి మరీ



ఇబ్బందులకు గురి చేస్తున్నాయని,రాత్రి సమయాలలో అత్యవసర పనులపై బయటకు రావాలంటే భయాందోళనకు గురి కావలసి వస్తుందని గ్రామల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో వ్యాధి సోకిన కుక్కల నిర్మూలనకు, సంబంధింత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.నోరులేని మూగ జీవాల పట్ల దయ చూపడం మానవ ధర్మమయినా,ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగేలా ఉంటే మాత్రం ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి.లేకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇప్పటికే కరోన వైరస్ తో దేశమంతా అల్లాడుతూ ఉంటే ఈ కుక్కల ద్వారా ఏ రోగం సంభవిస్తుం ధోనని ప్రజలు భయానికి గురి అవుతున్నారు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి రోగాల పడిన కుక్కలకు వైద్యం నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు

## విద్యార్థులకు వైద్యం నిర్వహించి మందులు పంపిణీ చేసిన ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్

బెల్లంకొండ:ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: మండలం లోని మండల ప్రాథమిక పాఠశాల మెయిన్ నందు డాక్టర్ ఆర్ శ్రీనివాస్. ఆయుష్ వైద్య సీజనల్ వ్యాధుల పైన కోవిడ్-19 పైన కోవిడ్ టీకా పైన ఆయుష్ సంవాద్, 'వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు వెల్లుల్లి అల్లం ఆహారంతో పాటు ఎక్కువ తీసుకోవలెను అల్లం టీ తాగవలెను గోరువెచ్చని నీటిని తాగవలెను .60 సంవత్సరాల వయస్సు దాటిన వారందరూ కోవిడ్ టీకా తప్పకుండా ఉంచుకోవాలని 45 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల గలవారు కోవిడ్ టీకా అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నారని ఆయన అన్నారు విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుష్ మందులను వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి చావన ప్రాశ్ లేహాము . సంశనవటి. పంపిణీ చేయడం జరిగినది వేసవికాలంలో తీసుకోవాల్సన జాగ్రత్తల గురించి కాటన్ దుస్తులు వదులుగా ఉన్న వి ధరించ వలెను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరక్కుండా ఉండవలెను ఒకవేళ అర్జంట్ ఉంటే తలకు టోపీ రుమాలు టవల్ చున్నీ ధరించవలెను కొబ్బరి బొండం నీళ్ళు జావా గంజి బార్లీ నీళ్లు మరియు మంచినీళ్లు రోజుకు నాలుగు నుండి ఐదు లీటర్ల వరకు త్రాగలని కొంచెం నిమ్మకాయ రసంలో చిటికెడు ఉప్పు ఒక చెంచా చక్కెర కలుపుకుని తాగలని తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ ఉదయ్ కుమార్ హెచ్ఎం, డాక్టర్ బాలకృష్ణ పాల్గొని ఆయుష్ మందులను పంపిని చేశారు ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు



## చేబ్రోలు మండలంలో శాస్త్రవేత్తల పర్యటన



చేబ్రోలు ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో మిరప, మొక్కజొన్న, కంది, మొదలగు పంటపొలాలను %సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శివ నారాయణ, జిల్లా వనరుల కేంద్రం నుండి%ఞాణ% శారద,%ూణూ% శివ కుమారి పరిశీలించారు అనంతరం పురుగు నివారణకు, అధిక దిగుబడులకు తగు సూచనలు సలహాలను రైతులకు ఇచ్చి ఏ పొలానికి ఏ టైం లో ఎంత నీరు పెట్టాలి, ఎన్ని రోజులు నీరు పెట్టాలి మొదల సూచనలను రైతులకు ఇచ్చి రైతుల దగ్గర నుంచి ప్రశంసలు పొందారు ఈ కార్యక్రమంలో పొన్నూరు సహాయ సంచాలకులు తిరుమల దేవి, శబరి మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి, రైతులు,రైతు కూలీలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం హుండి లెక్కింపు

పెనుగంచిప్రోలుఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:)పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో హుండీ లెక్కింపు జరిగింది శ్రీ తిరుపతమ్మ అ మ్మవారి దేవస్థానం సాధారణ ఖాతా ద్వారా 53,08, 816/-, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్యా న్న దాన ట్రస్ట్ ద్వారా 4,06,455, మొత్తం కలిపి 57,1 5,27 1/- రూపాయలు కాగా, మిశ్రమ బంగారం ద్వా రా 57.20 గ్రాములు, మిశ్రమ వెండి ద్వారా 641 గ్రా ము లు వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ యన్. వి.యస్.యన్ మూర్తి ప్రకటన చేశారు.




ఫూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
ఆశయాలు
ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

1. మహిళలందరికీ అన్ని రంగాలలో జనాభా ప్రాతిపదికన 50% రిజర్వేషన్స్ కల్పించుట.
2. మీరెంత జనాభా ఉంటే మీకు అంతే రిజర్వేషన్ అనే నినాదంతో జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు చట్టపరమైన రిజర్వేషన్స్ కల్పించుట.
3 చట్టపరమైన రిజర్వేషన్స్ అమలుకు నోడల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయుట.
4. ప్రైవేట్ రంగంలో నడిచే అన్ని సంస్థలలో రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయుట. వాటి వివరాలను సంస్థ నోటీస్ బోర్డులలో పెట్టి సమాచార హక్కు చట్టం (RTI ACT) పరిధిలో ఉంచుట.
5. కులనిర్మూలనలో భాగంగా జనాభా గణనలో "సమతాకులం" అనే పేరు మీద ఒక కొత్త కులాన్ని చేర్చి, వారికి ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రాధాన్యతను ఇస్తూ, కులాంతర వివాహం చేసుకున్నవారికి ప్రాణ, ఆస్తి, సామాజిక రక్షణ కల్పించడానికి బాధ్యత వహించడం. కులనిర్మూలన కోసం "సమతా కులమే" ఏకైక కులంగా ఉంచుట.
6. నిరుద్యోగ నిర్మూలన కొరకు 7వ తరగతి నుండి పిజి చేసిన ప్రతి నిరుద్యోగులకు వారికి ఇష్టమైన ఉద్యోగ, వ్యాపార రంగాలలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అవకాశాలను కల్పించుట.
7. అన్ని ప్రభుత్వ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చి, అందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించుట.
8 రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటిస్తూ, విపత్కర పరిస్థితుల్లో కౌలు రైతు / రైతుకు నష్టపరిహారం చెల్లించుట.
9. భూమి లేని రైతులందరికి నాలుగు ఎకరాల భూమి ఇచ్చుట
10 భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతిపౌరుడిని భాగస్వామిగా చేస్తూ దేశం వదిలి పారిపోని బహుజనులకు వారి వ్యాపార వ్యవసాయ రంగాలకు గాను రూ. 2,00,000/- (అక్షరాలా రెండు లక్షల రూపాయలను) హామి లేని ఋణాన్ని కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే ఇచ్చి, చెల్లింపులనంతరం రెట్టింపు ఋణాలిచ్చి ప్రోత్సాహించుట.
11. రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి చిరు ఉద్యోగి వరకు అందరూ విధిగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకొనుట.
12. ప్రతి పూరిగుడిసెను విశాలమైన వీధులలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కా గృహాలను నిర్మించుట.
13. అన్ని సమస్యలకు మూలకారణం అయిన "మద్యపానాన్ని" పూర్తిగా నిషేధించుట.
14. మతం మారినా కులం మరాదు కాబట్టి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ఎస్సీలకు వర్తింపచేయుట.
15. కార్మికులకు, కర్షకులకు, వలస కూలీలకు, వ్యవసాయ కూలీలకు, రూ. 50,00,000/- విధిగా జీవిత భీమాను కల్పించుట.
16. కుటీర పరిశ్రమలను పెట్టాలనే ఆసక్తివున్నవారికి మౌళిక వసతులు కల్పించి, వాటిని అద్దెకిచ్చి వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుట.
17. భూమిలేని ముస్లింలకు, క్రిష్టియన్‌లకు మరియు హిందువులకు ఆయా సంస్థల ఆధీనంలో గల భూములను పంచుట.
18. దేవాదాయ భూములను, భూమిలేని పేద రైతులకు కౌలుకు ఇచ్చుట.
19. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను ఒక ప్రత్యేక సంస్థగా రూపొందించుట.
20. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి నమోదైన ప్రతి ఒక ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రపోర్షనేట్‌గా ప్రభుత్వ అడ్వర్టైజ్‌మెంట్స్‌ను ఇచ్చి ప్రోత్సాహించుట.
21. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ రంగాలలో లంచం ఇచ్చే అవినీతి పరులను పాము కంటే విషపూరితమైన వ్యక్తిగా భావించుట.
22. ఎన్నికల్లో డబ్బులు పంచే వ్యక్తులను, ఆయా కుటుంబాలను ఎన్నికల్లో పోటి చేయకుండా, పోటీకి అనర్హులుగా ప్రకటించుట. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేయుట.

ఆంధ్రప్రదేశ్ ఆసక్తి ఉన్నవారు సంప్రదించగలరు తెలంగాణ

డా॥ ప్రత్యూష సుబ్బారావు కన్వీనర్, 9030644440
డా॥ పి. పరమ శివన్, 9440077239
నమ్మి అప్పారావు 9440137451
అమిరిశెట్టి శ్రీధర్ 9491664469
దేవి 9394668555
యం. కమలాకర్ రావు, 9393921011
సొంటి నాగరాజు, 9959488555
కె. హనుమంత్‌రావు ముదిరాజ్ 9392004473
అనుశ్చచంద్ర ప్రసాద్ 7989747376

మల్లెల రామనాథం, 9346939481
అరెపల్లి రాజేందర్, 9440918371
డా॥ గుండు కిష్టయ్య ముదిరాజ్, 9948335870
నాగుల శ్రీనివాస్ యాదవ్, 9849170810
లాల్ కృష్ణ ప్రసాద్,
రమ్య కురుమ,
ఉప్పు సత్యనారాయణ, 8688300704
డి. గోవర్ధన్, 9963300551

Central Working Committee Members :
జె.బి. రాజు బహుజన IIS-vrs నిశాంత్ బహుజన
డా॥ గూడూరు సీతామహాలక్ష్మి 8008840506
గుంజ నరసింహా రావు 7995914086
దూలపల్లి వాణి 8019033885
నేషనల్ కన్వీనర్ డా॥ కె. శివభాగ్యారావు బహుజన IRS-vrs
జై భీమ్... జై ఫూలే... జై భారత్

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 20, ఏప్రిల్ 2021

# మోడీ ప్రభుత్వ కబంధ హస్తాల్లో ఎన్నికల కమిషన్

మోడీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ సంస్థల విధ్వంసం అప్రతిహతంగా కొనసాగుతోంది. దీన్ని వివరించడానికి, భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి)కు మించిన ఉదాహరణ మరొకటి అవసరం లేదు. కేరళ నుండి ఖాళీగా వున్న మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించిన ఎన్నికలపై ఇ.సి అనుసరిస్తున్న వైఖరి ఒక స్పష్టమైన వాస్తవాన్ని మన ముందుకు తీసుకు వచ్చింది. మోడీ ప్రభుత్వ అభీష్టానికి అనుగుణంగా కమిషన్ నడుచుకుంటుందన్నదని దీనితో వెల్లడైంది. ఒక రాష్ట్రం నుండి ఎగువ సభకు వున్న ఖాళీలను భర్తీ చేయడమనే సాధారణ ప్రక్రియ విషయమై ఇ.సి అనుసరిస్తున్న వింత వ్యవహార శైలి మొత్తంగా ఈ విషయాన్ని విశదీకరిస్తోంది. ఏప్రిల్ 12న ఎన్నికలు జరుగుతాయని తొలుత ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కానీ, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పంపిన ఒక ప్రస్తావనను పరిశీలించేందుకుగాను ఎన్నికల క్రమాన్ని ఆపుతున్నట్లు వారం రోజుల తర్వాత ప్రకటించింది. ఎన్నికలను ఇలా నిలిపివేయడంపై ఇ.సి నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేరళ అసెంబ్లీ కార్యదర్శి, సిపిఎం ఎమ్మెల్యే కేరళ హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతమున్న అసెంబ్లీ సభ్యుల హక్కును కాలరాయవద్దని వారు వాదించారు. సభ్యుల పదవీ కాలం ముగియడానికి ముందుగానే ఎన్నికలను నిర్వహిస్తామని ఇ.సి తరపు న్యాయవాది తొలుత కోర్టుకు హామీ ఇచ్చారు. కానీ, దాన్ని రికార్డు చేయమని ఆదేశించేసరికి వెనుకంజ వేశారు. కొత్త అసెంబ్లీ కోసం ఏప్రిల్ 6వ తేదీన ప్రజలు ఓటు వేసిన నేపథ్యంలో ప్రస్తుత అసెంబ్లీ పదవీ కాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని సూచిస్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ పంపిన లేఖను...ఆ తర్వాత జరిగిన విచారణలో ఎన్నికల కమిషన్ ఉదహరించింది. కేంద్రం చేసిన సూచనను తాము ఆమోదించామని ఇ.సి రాతపూర్వకంగా అంగీకరించింది. హైకోర్టు ఈ వైఖరిని తోసిపుచ్చింది. మే 2వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేలోగా ఎన్నికలు నిర్వహించాలని ఇ.సి ని ఆదేశించింది. ఆ రకంగా మూడు సీట్లలో రెండింటిని గెలిచేందుకు ఎల్‌డిఎఫ్‌కు గల అవకాశాలను హరించాలని మోడీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని కోర్టు భగం చేసింది. మోడీ ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించేందుకు ఇ.సి ఎంత దూరం వెళుతుందనేది ఈ అధ్యాయంతో రుజువైంది. ప్రభుత్వ అవసరాలను ఎన్నికల కమిషన్ నెరవేర్చడమనేది ఇంతకుముందే ప్రారంభమైంది. 2019 ఏప్రిల్-మే మాసాల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటుగా జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇ.సి తీసుకున్న నిర్ణయం ఇటువంటిదే. లోక్‌సభ ఎన్నికలతో పాటుగా జమ్మూ కాశ్మీర్ ఎన్నికలను నిర్వహించరాదని ఇ.సి నిర్ణయించింది. ఆ రాష్ట్రం 2018 నవంబరు నుండి రాష్ట్రపతి పాలనలో వుంది. అందువల్ల లోక్‌సభతో పాటే రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయని భావించడం సహజమే. కానీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించకపోవడానికి భద్రతాపరమైన కారణాలను ఇ.సి పేర్కొంది. ఈ చర్య తాలూకు పర్యవసానాలు వెనువెంటనే కనిపించాయి. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన మూడు మాసాల కాలంలోనే మోడీ ప్రభుత్వం 370వ అధికరణను రద్దు చేసింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని ధ్వంసం చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర అసెంబ్లీకి తెలియచేయాల్సిన రాజ్యాంగబద్ధమైన ఆవశ్యకతను కూడా చాలా తెలివిగా తప్పించారు. ఎందుకంటే అక్కడ గవర్నర్ పాలన వుంది. అసెంబ్లీ స్థానంలో వున్న గవర్నర్‌తో సంప్రదిస్తే సరిపోతుంది కనుక అలా చేశారు. కేవలం భద్రతాపరమైన అవరోధాలను సాకుగా చూపించి ఆ నిర్ణయం తీసుకున్నట్లు అప్పటికి కనిపించినా, మోడీ ప్రభుత్వ విస్తృత ప్రయోజనాలను నెరవేర్చడమే దాని వెనకున్న ఉద్దేశం. ఎన్నికల బాండ్లకు సంబంధించి ఇ.సి వైఖరి ఇందుకు మరో ఉదాహరణ. 2017లో, ప్రభుత్వం ఎన్నికల బాండ్ల పథకాన్ని రూపొందించినపుడు, రాతపూర్వకంగా తమ అభిప్రాయాన్ని తెలియ చేయాల్సిందిగా ఇ.సి ని కోరింది. ఇ.సి ఈ పథకంపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీల నిధులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పారదర్శకతపై ఇది తీవ్రమైన ప్రభావాన్ని కలగచేస్తుందని హెచ్చరించింది. అలాగే ఎన్నికల బాండ్ల ద్వారా, రాజకీయ పార్టీలకు నిధులు అందించేందుకు భారత్‌లో పని చేస్తున్న విదేశీ కంపెనీలను అనుమతిస్తూ చట్టానికి సవరణ తీసుకురావడాన్ని కూడా ఇ.సి అభ్యంతరం వెలిబుచ్చింది. అయితే, మరో విడత బాండ్ల విడుదలపై స్టే ఇవ్వాలంటూ గత నెలలో సుప్రీంకోర్టు ముందుకు ఒక పిటిషన్ వచ్చింది. ఆ స్టే ఇచ్చేందుకు ఇ.సి తిరస్కరించింది. ఎన్నికల బాండ్లకు తాము వ్యతిరేకం కాదని, తమకు మాత్రం పారదర్శకత కావాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై ప్రధాన పిటిషన్లను విచారించే సమయంలో ఈ పారదర్శకతా సమస్యను పరిష్కరించవచ్చు. ఈ పథకం పట్ల తన తీవ్ర అభ్యంతరాల విషయమై ఇ.సి మరోసారి రాజీ పడింది. పశ్చిమ బెంగాల్‌లో 8 దశల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కూడా ఇ.సి వ్యవహార శైలి వివాదాస్పదంగానే వుంది. నలుగురు మరణించడానికి దారి తీసిన సీతల్‌కుచి ఘటనలో రాష్ట్ర పరిశీలకులు అందచేసిన తప్పుడు నివేదిక ఆధారంగా కేంద్ర బలగాల తప్పేమీ లేదని తేల్చి చెప్పింది. వాస్తవంగా జరిగిందేమిటో నిర్ధారించుకోవడానికి సైతం కమిషన్ ప్రయత్నించలేదు. ఇక బిజెపి, నరేంద్ర మోడీ, అమిత్‌షా నేతృత్వంలో తన సహజ ధోరణిలో కఠినమైన, రెచ్చగొట్టే మతోన్మాద ప్రచారాన్ని చేపట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో జరిగినట్లుగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినందుకు బిజెపి అగ్ర నాయకులెవరిపైనా ఈసారి కేసులు నమోదు కాలేదు. ఇందుకు విరుద్ధంగా మమతా బెనర్జీ చేసే ప్రసంగాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నాయంటూ ఆమె ఎన్నికల ప్రచారంపై 24 గంటల నిషేధం విధించారు. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరగడానికి ముందు కావాల్సింది నిష్పాక్షికంగా వ్యవహరించే ఎన్నికల కమిషన్. అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించడం దాని బాధ్యత. నేరస్తులను కఠినంగా ఎదుర్కొనాల్సి వుంది. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ జోక్యాన్ని ప్రతిఘటించాల్సి వుంది. లేని పక్షంలో, ఈ విషయంపై దశాబ్దాలుగా విశ్వసనీయమైన రికార్డు వున్న కమిషన్ ప్రస్తుతం ఆ పేరుప్రతిష్టలను కోల్పోయే ప్రమాదం వుంది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులకు కమిషన్ బాగా అలవాటు పడినట్లుంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో, ఎన్నికల కమిషనర్లలో ఒకరైన అశోక్ లావాసా స్వతంత్ర ఆలోచనా దృక్పథాన్ని ప్రదర్శించారు. మోడీ, అమిత్ షాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కేసుల్లో కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై దాదాపు ఐదుసార్లు తన అసమ్మతిని నమోదు చేశారు. ఆ తర్వాత లావాసా భార్య, కుమారుడు, సోదరి అందరూ ఆదాయ పన్ను విచారణలను ఎదుర్కొంటున్నారు. వీటి గురించి మీడియాలో బాగా ప్రచారమైంది కూడా. 'ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్'లో పదవిని ఆమోదించి, 2020 జులైలో కమిషనర్‌గా లావాసా రాజీనామా చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా సునీల్ అరోరా రిటైరయ్యారు. లావాసా వైదొలగనట్లయితే ఆయనే సిఇసి అయివుండేవారు. స్వతంత్ర, స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ సంస్థగా నడవాల్సిన కమిషన్ పని తీరులో ఇది తీవ్రమైన బలహీనతను తీసుకు వచ్చింది. సిఇసి, ఇతర కమిషనర్లను ఆ నాటికి వున్న ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. ఇది పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో వుంటుంది. ప్రారంభం నుండి, సివిల్ సర్వెంట్లను లేదా సర్వీస్ నుండి రిటైరైన వారిని కమిషనర్లుగా నియమించేవారు. ప్రభుత్వం లోని ఉన్నతస్థాయి వ్యక్తులకు అనుగుణంగా, వారికి సలాములు కొట్టే సివిల్ సర్వెంట్లు ఈ పదవులను పొందడం సులభం. అన్ని రాజ్యాంగబద్ధమైన సంస్థలను తన నియంత్రణ లోకి తెచ్చుకునేందుకు మోడీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం పని చేస్తోంది. ఇ.సి ప్రభుత్వానికి అనుబంధ సంస్థగా మారే ప్రమాదముంది. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పర్యవేక్షణ, దిశ, నియంత్రణ వంటి కర్తవ్యాలన్నింటినీ ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని 324వ అధికరణం కింద రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సి వుంది. ఇ.సి ఈ విషయంలో రాజీ పడినట్లైతే, మొత్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. మోడీ ప్రభుత్వ కబంధ హస్తాల నుండి ఇ.సి కి స్వేచ్ఛ కల్పించడం అత్యవసరం. అందుకు మొదటి చర్యగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక, నియామకం అనేది ప్రభుత్వ ఏకైక విశేషాధికారం కాకుండా చూడాలి. కమిషనర్లను ఎంపిక చేయడానికి విస్తృత కమిటీ లేదా కొలీజియాన్ని ఏర్పాటు చేయాల్సి వుంది. ఈ కమిటీలో ప్రభుత్వ ప్రతినిధులే కాకుండా, న్యాయ వ్యవస్థ ప్రముఖులు, ప్రతిపక్ష నేతలు, న్యాయ నిపుణులు వుండాలి. కేవలం సివిల్ సర్వెంట్లను మాత్రమే కమిషనర్‌గా చేయరాదు. ప్రముఖ న్యాయ నిపుణులు, విశిష్ట ప్రతిభావంతులు, ఇతర రంగాలకు చెందిన నిష్ణాతులు కూడా వుండవచ్చు. కమిషన్ సమగ్రతను పరిరక్షించేందుకు సిఇసిగా లేదా కమిషనర్లుగా పదవీ విరమణ చేసినవారు మరే ఇతర ప్రభుత్వ ప్రాయోజిత పదవులను ఆమోదించకుండా నిషేధం విధించాలి. ధన బలాన్ని, పార్టీ ఫిరాయింపులను అణచివేసేందుకు, ఎన్నికల వ్యవస్థ మరింత జవాబుదారీగా చేసేందుకు అత్యవసర ప్రాతిపదికన ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సి వుంది. కానీ, ఇటువంటి సంస్కరణలు ఎన్నికల కమిషన్‌ను సంస్కరించడం నుండే ప్రారంభం కావాల్సి వుంది.



## కన్నీటి వాన !

ఇప్పుడు
కళ్ళకు కలల్ని కుట్టుకొని
విశ్వ వీక్షణం
ఏమంత ఈజీ కాదు
బతుకు నాటకీయంలో
నడిచే దూరాన్ని
కాళ్ళతో కొలచి నడవడం
ఎంత మాత్రమూ
శ్రేయస్కరం కానే కాదు
బతుకులో ఆటుపోట్లు ఎన్నున్నా
నాలుగు గోడలు మధ్య
బందీని చేస్తేనే బతుకు భద్రం
నువ్వు చూసేదంతా వెలుగు కాదు
కసాయి కుట్రల క్రిమి కాగడాలా
నిన్ను ఏ క్షణమైనా దహించవచ్చు
ఇప్పుడు ఆకలి గానం ఆలపించే
పేగుల రొదతో పనిలేదు
పెచ్చులూడుతున్నజి
జీవన మాధుర్యాల్ని చూస్తూ
కాలం వొంపే
కన్నీటి వానలో తడిసి రోదించడం కాదు
భయాల నడుమ అజాగ్రత్తను వీడి
సమూహాలను త్రుంచి
మనిషిగా జాగ్రత్తల నడుమ
నువ్వు నడవడమే శ్రేయస్కరం..!!

# టీచర్లు లేకుండా చదువెలా వస్తుంది?



పాఠశాల విద్య ఎప్పుడూ టీచర్ల కొరతతోనే నడుస్తోంది. సంవత్సరాల తరబడి ఖాళీలు ఖాళీలుగానే ఉంటున్నాయి. పాలకులు, పార్టీలు ఏవైనా 'ప్రతి ఏటా డియస్సీ'ని మాత్రం అమలు చేయడం లేదు. వేల సంఖ్యలో ఖాళీలు పేరుకుపోయిన తర్వాత డియస్సీలు వేయడం, కోర్టు వాయిదాలతో కాలం గడిచిపోవడం జరుగుతోంది. గత డియస్సీలు ఏవీ షెడ్యూల్ ప్రకారం సకాలంలో అమలు కాలేదు. 2018 డియస్సీ వారికి 2020లో నియామకాలు చేశారు. ఈ డియస్సీకి సంబంధించి తెలుగు పండిట్ల నియామకాలు ఇప్పటికీ కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్నాయి. 2018 డియస్సీ అమలుగాక 2019, 2020 విద్యా సంవత్సరాలు టీచర్లు లేకుండానే గడిచిపోయాయి. రాష్ట్ర విభజన తర్వాత తూర్పు, పశ్చిమ గోదావరి ఏజన్సీ విలీన మండలాలలో టీచర్లందరూ తెలంగాణకు వెళ్ళిపోయారు. ఆ సందర్భంలో ఏజన్సీలో స్పెషల్ డియస్సీ వేయాలని పట్టుబట్టినా, పోరాడినా ప్రభుత్వం పట్టించుకోలేదు. మైదాన ప్రాంత ఉపాధ్యాయులను డిప్యుటేషన్ మీద వేసి పాఠశాలలు నడిపారు. రెండు చోట్లా విద్యా ప్రమాణాలు దెబ్బ తిన్నాయి. కనీసం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను అయినా ఇవ్వాలని డిమాండ్ చేసినా బడ్జెట్ మంజూరు చేయలేదు. రాష్ట్రంలో 30,532 ప్రాథమిక పాఠశాలల్లో 7,774 ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఇద్దరు టీచర్లున్న పాఠశాలలు 18,024 వున్నాయి. అంటే 30,532 పాఠశాలల్లో 25,798 పాఠశాలలు...ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులతో మాత్రమే నడుస్తున్నాయి. దీన్నిబట్టి మన పాఠశాలల్లో ప్రాథమిక విద్య ఎట్లా వుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల బదిలీల తర్వాత మోడల్ ప్రైమరీ స్కూళ్ళల్లో, ఇతర పాఠశాలల్లో పోస్టులు తగ్గించి ఒకరు, ఇద్దరు పని చేస్తున్న పాఠశాలల్లో ఖాళీ పోస్టులకు సర్దుబాటు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉపాధ్యాయులు ప్రతి రోజు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా పంపించే పనిలో కూరుకుపోతుంటే...ఇక నాణ్యమైన విద్య ఎలా అందుతుందో ఆలోచించాలి. విద్యాశాఖ అధికారులు విద్యా ప్రమాణాల గురించి అడగడం మానేసి యాప్‌ల ద్వారా సమాచారం పంపించారా లేదా అని అడుగుతున్నారు. ప్రభుత్వం తక్షణం ఈ పరిస్థితిని చక్కదిద్దాలి.

**ఖాళీలతో వేల కోట్లు మిగుల్చుకుంటున్న ప్రభుత్వం**

ప్రస్తుతం పాఠశాల విద్యలో 25 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కరోనా కారణంగా ప్రైవేట్ పాఠశాలల మూత, నాడు-నేడు, ప్రభుత్వ పథకాల వలన ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు పెరిగారు. పెరిగిన విద్యార్థులను కూడా లెక్కిస్తే ఉపాధ్యాయ ఖాళీలు 30 వేల పైనే ఉన్నట్లు తెలుస్తుంది. ఎ.పి రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మోడల్ స్కూళ్లు, పాఠశాలల్లో వేలాది పోస్టుల్లో నేటికీ సిఆర్‌టి లుగా, గెస్టు ఫ్యాకల్టీలుగా పని చేస్తున్నారు. రెగ్యులర్ వేకెన్సీలలో పని చేస్తున్న వీరిని రెగ్యులర్ చేస్తేనే ఈ ఖాళీలు భర్తీ చేసినట్లు భావించాలి. గెజిటెడ్ హెడ్ మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రెడేషన్, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రెడేషన్ కోసం వేలాది ఎస్‌జిటి పోస్టులను గత 20 ఏళ్లుగా సరెండర్ చేస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం 30 వేల పాఠశాలలకు 75 వేల ఎస్‌జిటి పోస్టులు మాత్రమే ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పోస్టులు లేవనే పేరుతో ఈ సంవత్సరం ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూళ్ళ కోసం 2017 నుండి అమలు చేసిన స్టాఫ్ ప్యాట్రన్ మార్చేసి విద్యా హక్కు చట్టం ప్రకారం పోస్టులు తగ్గించి రీఅపార్షన్‌మెంట్ చేశారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న పోస్టులు తగ్గించారు. ప్రస్తుతం వేల పాఠశాలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. 100-150-180 విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడితోనే నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయి.

**మున్సిపల్ పాఠశాల ఖాళీలు**

కరోనా కాలంలో మున్సిపల్ పాఠశాలల్లో ప్రవేశాలు విపరీతంగా పెరిగాయి. మున్సిపల్ పాఠశాలలు ఎక్కడ చూసినా తరగతి గదులు సరిపోని పరిస్థితి ఉంది. సెక్షన్‌కు 150-200 మంది విద్యార్థులతో నడుస్తున్న పాఠశాలలున్నాయి. ఒకవైపు ఖాళీ పోస్టులు భర్తీ కాక, మరోవైపు పిల్లల సంఖ్య పెరగడంతో ఉన్న ఉపాధ్యాయులపై పని భారం విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం మున్సిపల్ పాఠశాలల్లో ఉన్న పిల్లలకు ఉన్న ఉపాధ్యాయులు కంటే రెట్టింపు ఉపాధ్యాయులు కావాల్సి ఉంది. ఉపాధ్యాయుల ఖాళీలను సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ప్రభుత్వం బడ్జెట్ ఎలా మిగుల్చుకుంటుందో చూద్దాం. ప్రభుత్వ లెక్కల ప్రకారం 20 వేల వేకెన్సీలు వున్నాయనుకుంటే...నెలకు 20,000 శ రూ.41,000 (సరాసరి వేతనం) నెలకు రూ. 82 కోట్లు, సంవత్సరానికి రూ. 984 కోట్ల బడ్జెట్ మిగుల్చుకొంటుంది. 30 వేల ఖాళీలు అనుకుంటే జీతాల కోసం సంవత్సరానికి రూ.1500 కోట్లు ఖర్చు చేయాలి. ఇన్ని కోట్లు మిగుల్చుకొంటున్న ప్రభుత్వం ఈ ఖాళీలన్నింట్లో రూ. 10 వేల జీతంతో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తక్షణం నియమించాలని కోరుతున్నాం. దీనికి బడ్జెట్ లేదని తప్పించుకోవడంలో నిజాయితీ ఏముంది? 352 కస్తూరిబా పాఠశాలల్లో 3500 కాంట్రాక్ట్ టీచర్లు, 3500 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. నేటికి రెగ్యులర్ పోస్టులు ఒక్కటి కూడా ఈ పాఠశాలలకు మంజూరు చేయలేదు. ఈ పాఠశాలల్లో రెగ్యులర్ పోస్టులు మంజూరు చేసి అక్కడ పని చేస్తున్నవారిని రెగ్యులర్ చేయాలి.

**పూర్తి స్థాయి డియస్సీ**

ప్రభుత్వం 'నాడు-నేడు' మొదటి దశ పనులతో వేల ప్రభుత్వ పాఠశాలల మౌళిక సదుపాయాలను మెరుగుపరచడం అభినందనీయం. దీనితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉంది. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుంటే నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన రిపోర్టుల బాధ్యత బోధనా సమయం మొత్తాన్ని హరించి వేస్తున్నది. ఈ భారం తొలగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారానే పెరిగిన విద్యార్థులను నిలుపుకోగలుగుతాం. కావున 2021 డియస్సీని పూర్తిస్థాయి డియస్సీగా ప్రకటించి తక్షణం షెడ్యూల్ ప్రకటించాలి. ఈలోగా ఖాళీలన్నింటిని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లతో భర్తీ చేయాలి.

## అస్సోం ఫలితాలపై సీఏఏ ఎఫెక్ట్

గౌహాతి, ఏప్రిల్ 19, :ఐదు రాష్ట్రాలకు జరుగుతున్న ఎన్నికల్లో అసోంలో మాత్రం పోటీ నువ్వా? నేనా? అన్నట్లు ఉంది. ఇక్కడ అధికార బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తుంది. అనేక సర్వేలు కూడా ఈ విషయాన్ని వెల్లడించాయి. ఎన్డీఏకు కొంత ఎడ్జ్ ఉన్నట్లు కన్పిస్తున్నా చివరి నిమిషంలో కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలున్నాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ బీజేపీకి కాంగ్రెస్ గట్టిపోటీ ఇవ్వనుందని విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్నారు.అందుకే రాహుల్ గాంధీ అసోం ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అసోంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలున్నాయి. 64 మ్యాజిక్ ఫిగర్ గా ఉంది. ఇప్పటి వరకూ ఓపీనియన్ పోల్స్ చేసిన సర్వేల ప్రకారం ఎన్డీఏకు 69 స్థానాలు, యూపీఏకు 56 సీట్లు దక్కే ఛాన్సు ఉందని తేల్చాయి. అయితే చివరి నిమిషంలో మార్పులు జరగవచ్చని, ఫలితంలో మార్పు ఉండవచ్చని సర్వే సంస్థలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో అసోం ఎన్నిక ఆసక్తికరంగా మారింది.ఈశాన్య రాష్ట్రమైన అసోంలో కాంగ్రెస్ దీర్ఘకాలం పాలించింది. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయడంతో ఓటమి పాలయింది. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉంది. గత ఎన్నికలలో బీజేపీ అసోంలో 61 స్థానాలను గెలుచుకుంది. మిత్రపక్షాలతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అధికారంలో ఉండటంతో సహజంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందని కాంగ్రెస్ అంచనా వేస్తుంది. అందుకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు తరచూ అసోంలో పర్యటిస్తున్నారు.ఇక బీజేపీ కూడా అసోం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రెండోసారి విజయావకాశాలు ఉండటంతో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలు తరచూ అసోంలో పర్యటిస్తున్నారు. పౌరసత్వం చట్టంలో సవరణలు ఈసారి అసోం ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయి. అందుకే మోదీ, షాలు స్వయంగా వచ్చి అసోం ప్రజలకు వివరణ ఇచ్చుకుంటున్నారు. అయితే అసోంలో చివరి వరకూ గెలుపు ఎవరదనేది చెప్పడం కష్టమేనంటున్నారు విశ్లేషకులు.

# కొబ్బరిపై కరోనా ఎఫెక్ట్

అమలాపురం, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లాలో కొబ్బరి కాయల ధరలు గతంలో ఎన్నడూ లేనివిధంగా నేలను తాకుతున్నాయి. వెయ్యి పచ్చి కాయలు ఈ వేసవి సీజన్‌లో ఏటా రూ.13 వేలు పలికేవి. అంబాజీపేట మార్కెట్లో ప్రస్తుతం రూ.8 వేలకు మంచి ధర లభించడం లేదు. నాణ్యత కొంత తక్కువగా ఉండే రాజోలు, అమలాపురం తదితర మార్కెట్లలో రూ.6 వేల నుంచి రూ.7 వేలకు ధర మించడం లేదు. దీంతో, ఎకరాకు రైతులు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ నష్టపోతున్నారు. ఎకరాకు 1,200 కాయలు దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం ఎకరాకు 800 కాయలకు దిగుబడి మించడం లేదు. తెల్లదోమ కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ఎకరాకు 400 కాయలు దిగుబడి తగ్గిపోతున్నాయి. దీనివల్ల ఎకరాకు మరో రూ.4 వేలు నష్టం చవి చూడాల్సి వస్తోంది. కురిడీ కొబ్బరి కాయల ధరలూ మందగించాయి. రూ.14,000 పలికాల్సిన పలకాల్సిన గటగట రకం పాత కాయలకు ప్రస్తుతం రూ.11,000 మాత్రమే ధర లభిస్తోంది. ఫలితంగా రైతులు రూ.3 వేలు వరకూ నష్టపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతి నెలలో ధరలు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. ఆ తర్వాత ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో ధరలు క్రమంగా పతనమవుతూ వచ్చాయి. ఉగాది, శ్రీరామ నవమి పండగలు, మరో వైపు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. అయితే, కరోనా సెకండ్ వేవ్ వారి ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లింది. ఉత్తరాది రాష్ట్రాలైన ఢిల్లీ, గుజరాత్, బీహార్, మహారాష్ట్ర, హరియాణాలకు ఏటా ఇక్కడి నుంచి సీజన్లో కొబ్బరి కాయల ఎగుమతులు జోరందుకుంటాయి. దీంతో, ధరలు ఆశాజనకంగా ఉండొచ్చని రైతులు ఆశించారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో కరోనా ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొన్ని రాష్ట్రాల్లో మార్కెట్ల సమయాన్ని కుదించారు. దీంతో, ఎగుమతులపై ప్రభావం చూపుతోంది. గతంలో ప్రతి రోజూ తూర్పుగోదావరి జిల్లా నుంచి వంద నుంచి రెండు వందల



లారీల వరకు కొబ్బరి ఎగుమతులు చేసేవారు. ప్రస్తుతం దిగుబడి తగ్గడం, ధర పతనం అవ్వడం, ఈశాన్య రాష్ట్రాల్లో డిమాండ్ లేకపోవడంతో రోజుకు 40 నుంచి 50 లారీలకు మించి ఎగుమతి కావడం లేదు. ఇక్కడ సాగు చేసిన కొబ్బరి కాయలకు కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి పోటీ నెలకొంది. అక్కడ సాగు చేసిన కాయలు పరిమాణంలో పెద్దగా ఉంటున్నాయి. అక్కడి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రవాణా ఖర్చులు కూడా తక్కువగా ఉంటున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా ఆ ప్రాంతాలకే తొలి ప్రాధాన్యత లభిస్తోంది. అక్కడి మార్కెట్లో కాయల కొరత ఏర్పడితేనే ఇక్కడ డిమాండ్ పెరుగుతుంది. జిల్లాలో 1.15 లక్షల ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. 40 వేల మంది కొబ్బరి రైతులు ఉన్నారు. సుమారు 1.2 లక్షల మంది కూలీలు కొబ్బరి మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అంబాజీపేట ప్రధాన కేంద్రంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, తెలంగాణ, నాగ్‌పూర్ తదితర రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతి చేస్తున్నారు. కొబ్బరి ధర పెరగకపోతే తీవ్రంగా నష్టపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మెజార్టీ కష్టమేనా..?




తిరుపతి, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:తిరుపతిలో వైసీపీ ఆశలు ఫలించేట్లు లేదు. మెజారిటీపై వైసీపీ నేతలు పెట్టుకున్న ఆశలు ఫలించేట్లు లేవు. దీనికి ప్రధాన కారణం తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడమే. తిరుపతి ఉప ఎన్నికను ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా తిరుపతి మెజారిటీపై చర్చ జరగాలని జగన్ భావించారు. ఐదు లక్షల మెజారిటీ రావాలని జగన్ మంత్రులకు, పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు.దాదాపు పదిహేను రోజుల పాటు మంత్రులు తమకు అప్పగించిన నియోజకవర్గాల్లోనే మకాం వేసి వైసీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్నారు. గురుమూర్తి కూడా సరైన అభ్యర్థి కావడంతో తమకు ఐదు లక్షల మెజారిటీ ఖాయమని మంత్రులు భావించారు. ఒక్క తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అత్యధిక మెజారిటీ తెస్తామని భావించారు. ఈ మేరకు జగన్ కు నివేదికలు కూడా ఏడు నియోజకవర్గాల నుంచి అందాయి.అయితే జగన్ ఉత్సాహం మీద తిరుపతి ఉప ఎన్ని నీళ్లు చల్లిందనే చెప్పాలి. జగన్ ఆశించినట్లు ఐదు లక్షలు కాదు గదా గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ వస్తే చాలునన్న పరిస్థితి నెలకొంది. గత పార్లమెంటు ఎన్నికల్లో 79.76 శాతం పోలింగ్ నమోదయింది. ఆ ఎన్నికల్లో వైసీపీ అప్పటి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాదరావుకు 2.50 లక్షల వరకూ మెజారిటీ వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా వీచిన జగన్ గాలి కూడా అప్పుడు పనిచేసింది. అప్పుడు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఓట్లు 13.40 లక్షలు మాత్రమే.తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. గతంలో కంటే నాలుగు లక్షల మంది కొత్త ఓటర్లు వచ్చారు. దీంతో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 17 లక్షల మంది వరకూ ఓటర్లున్నారు. అయితే పోలింగ్ శాతం 63 మాత్రమే. అంటే దాదా? 10.10 లక్షల మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం జరిగిన త్రిముఖ పోటీలో వైసీపీకి ఈ పోలింగ్ శాతంతో ఐదు లక్షల మెజారిటీ రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం మీద కరోనా భయం కావచ్చు. ఉప ఎన్నికపై అనాసక్తి కావచ్చు తిరుపతి నియోజకవర్గంలో ఓటర్లు వైసీపీ టార్గెట్ ను దెబ్బతీశారనే చెప్పాలి.

# ఆ ముగ్గురు హ్యాండ్సప్...!





తిరుపతి, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:తిరుపతి ఉప ఎన్నిక ఫలితం ఎలా ఉండబోతోందన్న విషయంలో ఎవ్వరికి సందేహం లేదు. అధికార వైసీపీ ఇక్కడ పాగా వేసి తన సిట్టింగ్ సీటు నిలబెట్టుకుంటుందనే అందరూ చెపుతున్నారు. పరిణామాలు కూడా అలాగే ఉన్నాయి. అయితే ఆ పార్టీ నిర్దేశించుకున్నట్టుగా 3 లక్షల మెజార్టీ వస్తుందా ? రాదా ? ఈ మెజార్టీని విపక్ష పార్టీలు ఎంత వరకు తగ్గిస్తాయన్న సందేహం ఒక్కటి మాత్రమే మిగిలి ఉంది. వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఎంత ఫుల్ స్వింగ్‌లో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.ప్రత్యేకించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నా.. ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ యాక్టివిటీస్ లో అంత చురుకుగా ఉన్నారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. వారిలో వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, గూడురు ఎమ్మెల్యే వరప్రసాద్‌ల విషయంలో చర్చ జరుగుతూ ఉంది. వీరిద్దరిలో రామనారాయణ రెడ్డి అసలు నియోజకవర్గంలో కేడర్‌కే అందుబాటులో ఉండడం లేదని పార్టీ నేతలే చెపుతున్నారు. ఉంటే ఆయన హైదరాబాద్‌లో ఉండడం లేదా నెల్లూరులో ఉండడమో చేస్తున్నారట.కాంగ్రెస్‌లో ఓ వెలుగు వెలిగిన ఆయన రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం కూడా కిరణ్‌కుమార్ రెడ్డి మనిషిగా జిల్లా రాజకీయాలు శాసించారు. ఆ తర్వాత జగన్‌ను తీవ్రంగా విబేధించి టీడీపీలో చేరారు. అక్కడా ప్రయార్టీ లేకపోవడంతో గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యే అయ్యారు. సీనియార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని అధిష్టానంపై ఆగ్రహంతో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇక జగన్‌ను సైతం ఆయన విమర్శిస్తున్నారు. ఈ ఉప ఎన్నికను కూడా ఆయన పట్టించుకోకపోవడంతో పార్టీ అధిష్టానం వెంకటగిరి బాధ్యతలు ఇద్దరు మంత్రులకు అప్పగించింది. అసలు అధిష్టానం సైతం ఆయన్ను పట్టించుకోకుండా వెంకటగిరిలో ప్రచారం చేస్తోంది.ఇక ఇక గుడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ కూడా గతంలో అంత యాక్టివ్ గా లేరు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తిరుపతి ఎంపీగా ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యాక గూడూరులో గ్రూపు రాజకీయాలకు కేంద్ర బిందువు అయ్యారు. రెడ్డి సామాజిక వర్గంతో పాటు పార్టీలో సీనియర్ నేతలను ఆయన పట్టించుకోవడం లేదు. దీంతో ఆయనపై సొంత పార్టీ కేడర్లోనే తీవ్రమైన వ్యతిరేకత ఉంది. వైసీపీ అధిష్టానం ఆయన్ను కూడా పట్టించుకోకుండా తన డైరెక్షన్‌లోనే గూడూరులో ప్రచారం చేస్తోంది.ఇక సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి కూడా పైకి చెప్పుకోకపోయినా లోలోన రగులుతున్నారు. ఈ ఉప ఎన్నికల ప్రచారాన్ని ఆయన లైట్ తీస్కున్నారనే అంటున్నారు. గతంలో జడ్పీ ఛైర్మన్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉండడంతో పాటు సోమిరెడ్డి లాంటి నేతను రెండు సార్లు ఓడించి? పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిలబెట్టినా తనకు కనీసం ప్రయార్టీ ఇవ్వలేదని ఆయన కొద్ది రోజులుగా అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. దీనికి తోడు కోటం రెడ్డితో పాటు మంత్రి అనిల్‌తో ఉన్న గ్యాప్ నేపథ్యంలో కాకాణ అసమ్మతి నివురు గప్పిన నిప్పులా ఉంది. ఇక పైకి చెప్పుకోకపోయినా తిరుపతిలో భూమనకు ఇటీవల కార్పోరేషన్ ఎన్నికల్లో ప్రయార్టీ ఇవ్వలేదని ఆయన కూడా రగులుతున్నారు. మరి వీరి అసమ్మతి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు / మెజార్టీపై ఎంత వరకు ప్రభావం చూపిస్తుందో ? చూడాలి.

# అందరికి దూరమవుతున్న అఖిల



కర్నూలు, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:భూమా కుటుంబానికి ఒకప్పుడు రెండు నియోజకవర్గాల్లో పట్టు ఉండేది. ఇటు ఆళ్లగడ్డతో పాటు నంద్యాల నియోజకవర్గంలనూ భూమా కుటుంబం నుంచి ఎన్నికయ్యేవారు. రెండు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్ ఉండేది. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి జీవించి ఉన్నంత కాలం క్యాడర్ ను నేతలను ఆ కుటుంబం కాపాడుకుంటూ వచ్చింది. అయితే ఇప్పుడు రెండు నియోజకవర్గాల్లో క్యాడర్ చెల్లాచెదురయిపోతోంది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత నంద్యాల, ఆళ్లగడ్డల్లో భూమా కుటుంబ రాజకీయానికి ఇబ్బందులు తలెత్తాయి. అఖిలప్రియ ఆళ్లగడ్డలో పార్టీ వ్యవహారాలు చూసుకుంటున్నా ఆమెను నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ఆళ్లగడ్డలో ఉండకుండా ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే ఉండటం, ఇక్కడ పార్టీని పట్టించుకోకపోవడం అఖిలప్రియకు మైనస్ గా మారింది. అఖిలప్రియ తమను పట్టించుకోవడం లేదన్న ఆవేదన క్యాడర్ లో కనపడుతుంది.ఇక అఖిలప్రియ భర్త కారణంగా కూడా కుటుంబంలో విభేదాలు తలెత్తాయంటారు. ఇప్పటికే భూమా కుటుంబం నుంచి కొందరు బీజేపీలోకి వెళ్లిపోయారు. ఇక తాజాగా భూమా కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్న వారు కూడా వైసీపీ పార్టీలో చేరిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కూడా నంద్యాల, ఆళ్లగడ్డల్లో టీడీపీ పరాజయం పాలయింది. కనీసం పోటీ చేసిన వారిని కూడా ఏ రకంగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఆళ్లగడ్డ లోనే క్యాడర్ ను రక్షించుకునేందుకు అఖిలప్రియ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక నంద్యాలను పట్టించుకునే పరిస్థితి ఏమాత్రం లేదు. నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కూడా అఖిలప్రియతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. ఇక్కడి నుంచి వచ్చే ఎన్నికల్లో తన సోదరుడిని పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో అఖిలప్రియఉండటంతో ఆమె కు దూరమయ్యారని చెబుతున్నారు. మొత్తం మీద రెండు నియోజకవర్గాల్లోనూ భూమా అఖిలప్రియ రాజకీయంగా ఇబ్బంది పడుతున్నారు.

## జగనన్న విద్యా దీవెన" ద్వారా 10.88 లక్షల మంది పిల్లలకు లబ్ధి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట ఏప్రిల్ 19 ప్రజా పాలన:జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా రాష్ట్రంలో 10.88 లక్షల మంది పిల్లలకు లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభా ను తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లా డు తూ 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద 2020%--%21 ఫీజు రీయింబర్స్‌మెంట్ మొదటి విడత నగదును ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత కింద అర్హులైన 10,88,439 మంది వి ద్యార్థులకు సంబంధించిన రూ.671.45 కోట్ల రూపా యల నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చే యడం జరిగిందని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభు త్వం అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పథకాన్ని నీ రుగార్చడమే కాకుండా పెద్దఎత్తున బకాయిలు పెట్టిం దని, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రె డ్డి అర్హులైన వారందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెం ట్‌ను బకాయిలు లేకుండా నాలుగు విడతల్లో ఏ త్రై మాసికానికి ఆ త్రైమాసికంలోనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా బకాయి పెట్టి న రూ.1,880 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చే శా రు.



# చినబాబు ఫ్యూచర్ ఏంటీ..?



గుంటూరు, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి: చంద్రబాబు పరిస్థితి ఇపుడు చాలా ఇబ్బందికరంగా ఉందని టాక్. ఒక వైపు పార్టీ మరో వైపు పుత్ర రత్నం. ఈ రెండింటినీ బ్యాలన్స్ చేయలేక చంద్రబాబు సతమతమవుతున్నారు అంటే సబబే అనాల్సిందేగా. సీనియర్ నేతలు తనను గౌరవించినట్లుగా లోకేష్ కి విలువ ఇవ్వాలంటే అది కుదిరే పని కాదు, మరో వైపు చూస్తే ఇంటి పోరు ఇంతింత కాదయా అన్నట్లుగా లోకేష్ ని పార్టీకి భావి వారసుడిగా ప్రకటించకపోతే సొంత ఇంటిలోనే గొడవలు జరిగిపోతాయి అన్నట్లుగా సీన్ ఉందిట. దాంతో ఇంట్లో వాళ్ళకు చెప్పలేక బయట పార్టీని సముదాయించలేక చంద్రబాబు పడుతున్న పాట్లు ఆయన టోటల్ పొలిటికల్ లైఫ్ లో ఎన్నడూ అనుభవించి ఉండరేమో అంటున్నారు. లోకేష్ కి మంత్రి పదవి ఇస్తే తన పదవికి ఎసరు వస్తుంది అన్నది విశేష రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియనిది కాదు, కానీ ఇంట్లో వారి వత్తిడి ఆయన మీద విపరీతంగా ఉండడం వల్లనే చినబాబుని మంత్రిగా చేశారు అన్న ప్రచారం అయితే అప్పట్లో వచ్చింది. ఆ తరువాత చంద్రబాబుకు అసలైన కష్టాలు కూడా మొదలయ్యాయి. నాటి నుంచే సీనియర్లు తోక జాడించడం మొదలుపెట్టారు.

ఇక పార్టీలో కూడా చినబాబు అతి జోక్యం వల్ల పట్టు తప్పి కట్టు కూడా దాటింది. ఇవన్నీ కలగలసి 2019 ఎన్నికల్లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ ఘోర ఓటమిని నెత్తికెత్తుకుంది. ఇదిలా ఉంటే తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల ప్రచారాన్ని లోకేష్ సీరియస్ గానే తీసుకున్నాడు అంటున్నారు. ఆయన తండ్రి కంటే చాలా ముందుగానే తిరుపతికి వెళ్ళి మరీ ఎర్రటి ఎండలో రోడ్డు మీద పడి ప్రచారం నిర్వహించాడు. అయితే చంద్రబాబు తరువాత రావడం తనదైన శైలిలో ప్రచారం చేయడంతో లోకేష్ కొంత తేలిపోయాడు. ఇదిలా ఉంటే తిరుపతి ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి ఓట్లను పెంచడం, వైసీపీ మెజారిటీని తగ్గించడం ద్వారా తాను ధీటు అయిన నేతగా పార్టీలో ఎస్టాబ్లిష్ కావాలని లోకేష్ పెద్ద కలలే కన్నారుట. కానీ అనుకున్నది ఒకటైతే జరిగింది వేరొకటి అంటున్నారు. అచ్చెన్నాయుడు ఏకంగా తన పరువు తీసేలా వీడియోలో అన్న మాటలతో చినబాబు హర్ట్ అయ్యారని కూడా చెబుతున్నారు. దాంతో అచ్చెన్న అది ఫేక్ వీడియో అని ఎంత మొత్తుకుంటున్నా షాక్ వీడియోగానే లోకేష్ చూస్తున్నారు అంటున్నారు. తనను పార్టీలో ఉన్న విలువ మర్యాదా అచ్చెన్న మాటల ద్వారా తెలుసుకున్న మీదట లోకేష్ మండిపోతున్నారని అంటున్నారు. తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో పూర్తిగా ఉండకుండానే ముందుగానే హైదరాబాద్ ఆయన చేరుకున్నారు అంటున్నారు. దీంతో లోకేష్ అలిగాడు అన్న ప్రచారం కూడా పార్టీలో పెద్ద ఎత్తున వ్యాపించింది. ఇక చంద్రబాబు ఈ విషయంలో అచ్చెన్నాయుడిని వివరణ అడగకుండా మౌనం వహించడం చినబాబుకు నచ్చలేదని కూడా అంటున్నారు. ఇదిలా ఉంటే సీనియర్ నేత అయిన అచ్చెన్నకు చెప్పలేక లోకేష్ ని సముదాయించలేక బాబు అతి పెద్ద ఇరకాటంలో పడ్డారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీని మీద వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అయితే అదిరిపోయే పంచులే వేస్తున్నారు. చినబాబు అలిగి ముందే హైదరాబాద్ చెక్కేశాడని, అచ్చెన్న ఇక వేరే పార్టీలో చేరిపోవడానికి దారి చూసుకోవచ్చంటూ సాయిరెడ్డి వేస్తున్న సెటైర్లు టీడీపీలో మరింతగా మంట పుట్టిస్తున్నాయిట.

## పినరయికే పీఠం

తిరువనంతపురం, ఏప్రిల్ 19, : కేరళలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఇక ఫలితాలు రావడమే తరువాయి. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి అందరిలోనూ ఉత్కంఠ రేపుతుంది. ఈసారి కేరళలో హోరాహోరీ పోరు జరిగింది. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటముల మధ్య విజయం దోబూచులాడుతోంది. ఓపీనియన్ పోల్స్ పినరయి విజయన్ మరోసారి అధికారంలోకి వస్తాయని చెప్పాయి. అయితే ప్రచారం తర్వాత అనూహ్యంగా మార్పు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తోంది. కేరళలో మొత్తం 140 అసెంబ్లీ స్థానాలున్నాయి. 71 స్థానాలు వస్తే అధికారాన్ని చేజిక్కించుకునట్లే. కేరళ లో సంప్రదాయం ప్రకారం ఒకసారి గెలిచిన పార్టీ మరోసారి విజయం సాధించలేదు. ఇది నలభై నాలుగు సంవత్సరాల నుంచి చెబుతున్న రాజకీయ చరిత్ర. అయితే దీనిని ఈసారి పినరయి విజయన్ బ్రేక్ చేస్తారని ఎల్డీఎఫ్ వర్గాలు చెబుతున్నాయి. కేరళలో అత్యధికులు విద్యాధికులు కావడంతో పినరయి విజయన్ పాలన పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీజేపీ బలం పెంచుకోవడం కూడా పినరయి విజయన్ కు కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితమయింది. అయితే మారిన పరిస్థితుల దృష్ట్యా ఈసారి బీజేపీ ఓటు శాతాన్ని పెంచుకునే అవకాశముంది. ఇది విపక్షంలో ఉన్న ఎల్డీఎఫ్ కే దెబ్బ అన్నది పరిశీలకుల మాట. పినరయి విజయన్ కూడా ఇదే ఆశలు పెట్టుకున్నారు. మరోసారి తనకు అవశాశమిస్తారని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. ఇక కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూడా పోటా పోటీగా ఉంది. ఓపీనియన్ పోల్స్ లో 62 స్థానాలు యూడీఎఫ్ కు రావచ్చని తేలింది. అయితే నెలరోజుల నుంచి వచ్చిన మార్పులు తమకు అవకాశాలున్నాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. రాహుల్ గాంధీ పర్యటనతో పాటు దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కూడా కాంగ్రెస్ కు కలసి వస్తాయంటున్నారు. మొత్తం మీద పినరయి విజయన్ ఈసారి గట్టి పోటీ ఇచ్చారు. అన్నీ అనుకూలిస్తే మరో సారి పినరయి విజయన్ ముఖ్యమంత్రి అయ్యే ఛాన్స్ మాత్రం ఉంది.

# విశాఖలో మరో ఉప ఎన్నిక





విశాఖపట్టణం, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:వైసీపీతో విశాఖ రాజకీయం ఆటలాడుతూనే ఉంది. దాదాపుగా వంద వరకూ ఉన్న వార్డుల్లో డెబ్బై నుంచి ఎనభై శాతం వైసీపీ పరం అవుతాయని గత ఏడాది అనుకున్నారు. కానీ సడెన్ గా ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ ఏడాది కాలంలో సీన్ మొత్తం మారిపోయింది. మొత్తానికి చావు తప్పి కన్ను లొట్టబోయిన చందంగా 98 వార్డులకు గానూ 58 సీట్లతో వైసీపీ మేయర్ సీటుని గెలుచుకుంది. ఇలా గెలుచుకుందో లేదో అలా ఒక కార్పోరేటర్ సీటుకు ఉప ఎన్నిక వచ్చిపడింది. ఇక వైసీపీకి చెందిన 61వ వార్డు కార్పోరేటర్ దాడి సూర్యకుమారి హఠాత్తుగా మరణించారు. ఆమె ప్రమాణం చేసి వచ్చిన రెండు రోజులకే ఈ లోకాన్ని వీడారు. ఇపుడు ఆ సీట్లో ఉప ఎన్నిక అనివార్యం అయింది. సూర్యకుమారి గెలిచింది కూడా టఫ్ కాంపిటేషన్ మీద. కేవలం 500 ఓట్ల తేడాతోనే ఆమె కార్పోరేటర్ అయ్యారు. ఇక్కడ టీడీపీ బలంగా ఉంది. దాంతో పాటుగా వామపక్షాలు కూడా గట్టిగానే ఉన్నాయి. దాంతో మొత్తానికి ఏదో విధంగా వైసీపీ బయటపడింది. అలాటి సీట్లో ఇపుడు ఉప ఎన్నిక ఖాయంగా ఉందనిజానికి ఇక్కడ వైసీపీకి మంచి బలం ఉండేది. కానీ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నేపధ్యంలో కేంద్రం మీద ఉన్న కోపం కాస్తా ఏపీ సర్కార్ మీద పడుతోంది. టీడీపీ నాయకులు సైతం బీజేపీతో లాలూచీ పడి వైసీపీ సర్కార్ ఉక్కు ప్రైవెటీకరణ మీద నోరెత్తడంలేదని దారుణంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారంతో టీడీపీ గెలుపు అంచుల దాకా వచ్చేసింది. అదే సమయంలో వైసీపీ బొటా బొటీ మెజారిటీతో గెలుచుకుంది. ఇపుడు అక్కడ కనుక ఉప ఎన్నిక జరిగితే వైసీపీ ఫేట్ ఎలా మారుతుందో అన్న టెన్షన్ పార్టీ నేతలకు పట్టుకుంది. ఇక విశాఖ మేయర్ విషయంలో జగన్ చేసిన ప్రయోగం ఆశావహులకు పెద్దగా నచ్చలేదు అంటున్నారు. పేరున్న నోరున్న నాయకులు తమ ఇంటి వారిని కార్పోరేటర్లను చేశారు వారిని మేయర్ గానో డిప్యూటీ మేయర్ గానో చూడాలనుకున్నారు. కానీ పెద్దగా రాజకీయంగా పలుకుబడి లేని గొలగాని హరివెంకట కుమారిని మేయర్ చేయడంతో వారంతా ఖంగు తిన్నారు. ఇక మేయర్ కోసమే 21వ వార్డు నుంచి కార్పోరేటర్ గా పోటీ చేసిన వంశీ అయితే తన పదవికి రాజీనామా చేస్తాను అంటున్నారు. ఇపుడు జీవీఎంలో మ్యాజిక్ ఫిగర్ కంటే పది సీట్లు మాత్రమే వైసీపీకి ఎక్కువగా వచ్చాయి. అందులో ఒకరు చనిపోవడం, మిగిలిన వారిలో అసంతృప్తి మొదలుకావడం ఈ మొత్తం ప్రభావం మేయర్ సీటుకు ఎసరు తేదు కదా అన్న చర్చ అయితే సొంత పార్టీ పెద్దలలో ఉంది.

# చంద్రబాబుకు జేసీ సలహా



అనంతపురం, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పరిషత్ ఎన్నికల ను బహిష్కరించడానికి పరోక్షంగా జేసీ దివాకర్ రెడ్డి కారణం. జేసీ దివాకర్ రెడ్డి తొలి నుంచి ఎన్నికలను బహిష?కరించాలని చెబుతూ వస్తున్నారు. అధికార పార్టీ చేస్తున్న ఆగడాలను ఎదుర్కొనలేమని, ఆర్థికంగా, కేసుల వరంగా ఇబ్బందులు పడటం వృధా అని జేసీ దివాకర్ రెడ్డి పదే పదే చెబుతూ వస్తున్నారు. అయినా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసినా తెలుగుదేశం పార్టీకి విజయం దక్కలేదు. జేసీ దివాకర్ రెడ్డి రాజకీయాల నుంచి తాను తప్పుకున్నానని చెబుతున్నా తాడిపత్రి, అనంతపురం రాజకీయాల్లో యాక్టివ్ గానే ఉన్నారు. వరస కేసులు తమ కుటుంబంపై నమోదవుతున్నా, ఆర్థికంగా తమను అధికార పార్టీ దెబ్బతీస్తున్నా ఉగ్గపట్టి పార్టీలోనే ఉన్నారు. మరే పార్టీలోకి వెళ్లలేక, టీడీపీలోనే ఉండి తమ రాజకీయ భవిష్యత్ ను తేల్చుకోవాలని జేసీ దివాకర్ రెడ్డి భావిస్తున్నారు. ఈనేపథ్యంలో పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయవద్దని ఆయన చంద్రబాబుకు చెప్పారని తెలిసింది. ఎన్నికలను బహిష్కరించాలని మున్సిపల్ ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు జేసీ దివాకర్ రెడ్డి సూచించారట. అయితే ఆయన మాటను చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. ఫలితాల తర్వాత జేసీ దివాకర్ రెడ్డి మరోసారి చంద్రబాబుకు చెప్పారని తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసినందున నష్టపోయేది పార్టీయేనని, ఆర్థికంగా తాము ఎదుర్కొనడానికి సిద్ధంగా లేమని జేసీ దివాకర్ రెడ్డి సూచనతో ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారని తెలుస్తోంది. జేసీ దివాకర్ రెడ్డి చెప్పిన దాంట్లో లాజిక్ ను గమనించిన చంద్రబాబు పరిషత్ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో పోటీ చేసి మరింత మంది నేతలను పార్టీకి దూరం చేసుకునేందుకు చంద్రబాబు ఇష్టపడలేదు. అందుకే జేసీ దివాకర్ రెడ్డి మాటకు చంద్రబాబు విలువ ఇచ్చారంటున్నారు. మొత్తం మీద జేసీ దివాకర్ రెడ్డి సలహాతోనే చంద్రబాబు పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉన్నారన్న కామెంట్స్ పార్టీలో వినపడుతున్నాయి.

# మళ్లీ ఏపీ, తెలంగాణ ఆస్తుల రచ్చ




హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:ఏపీ, తెలంగాణ జుట్టు జుట్టు పట్టుకుంటే కేంద్రం ఆ గొడవను పరిష్కరించడం కంటే ఎంజాయ్ చేసేందుకే సిద్ధంగా ఉందా ? అంటే అవుననే చర్చలు నడుస్తున్నాయి. సమైక్యాంధ్ర రాష్ట్ర విభజన తర్వాత ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం చేస్తూ నిర్ణయాలు తీసుకునేందుకు అప్పట్లోనే మూడు సమావేశాలు జరిగాయి. ఈ సమన్వయ సమావేశాల బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వమే తీసుకుంది. ఈ సమావేశాల్లో ఎవరికి వారు వాదనలు వినిపించారు. ముఖ్యంగా సెక్షన్ 9, సెక్షన్ 10లలో రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన ఉంది. అయితే ఈ ఆస్తుల విభజనలో తెలంగాణ ప్రభుత్వం తనంతట తానుగా జీవోలు జారీ చేసేసుకుని అక్కడ ఉన్న ఆస్తులు అన్నీ తమవే అని తీర్మానించేసుకుంది. దీనిపై అప్పటి ఏపీ ప్రభుత్వం అప్పీలుకు వెళ్లగా సుప్రీం సైతం ఈ విషయాన్ని కేంద్రమే పరిష్కరించాలని చెప్పింది. నాటి ఉమ్మడి హైకోర్టు ఇదే విషయం స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకునే క్రమంలో మేం పరిష్కరించుకుంటామంటూ మళ్లీ అప్పటి సీఎంలు వెనక్కు తగ్గారు. ఇక కేంద్ర హోం శాఖ ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సి ఉంది. అయితే హోం శాఖ కార్యదర్శులు సీనియార్టీ ప్రకారం ప్రతి 9-10 నెలలకు మారిపోతుంటారు. వీరి ముందు ఇక్కడ సమస్య చెప్పడం వారు నిర్ణయం తీసుకునేలోగానే మారిపోతుండడం.. మళ్లీ కొత్త కార్యదర్శి ముందుకు ఈ పంచాయతీ వెళ్లడం.. ఆయన కూడా మారిపోవడం ఇలా రెడ్డి వచ్చె మొదలు అన్నట్టుగా మారిపోతోంది. రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, ఇతరత్రా వివాదాల్లో జగన్ సీఎం అయిన వెంటనే కొన్ని పరిష్కారం అయినా మరికొన్ని మాత్రం అలాగే ఉండిపోయాయి. ఇక ఈ వివాదంలో ఎవరో ఒక హోం శాఖ కార్యదర్శి డేరింగ్ డెసిషన్ తీసుకుంటే వివాదం సులువుగానే పరిష్కారం అవుతుంది. కానీ వాళ్లు కూడా కావాలనే నాన్చుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు కొత్త హోం సెక్రటరీ మళ్లీ ఇరుపక్షాల వాదనలు వినబోతున్నారు. ఆయన కూడా వీటిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే మళ్లీ ఇది వాయిదా పడిపోవడం ఖాయం. ఈ కొత్త హోం సెక్రటరీకి కూడా నాలుగు నెలల సమయం మాత్రమే ఉంది. వాస్తవానికి రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకం అంశాన్ని తొలి రెండేళ్లలోనే తేల్చుకోవాల్సి ఉంది. ఇక విభజన చట్టంలో వీటికి 10 ఏళ్ల గడువు ఉంది. పదేళ్లలో కూడా ఇవి కొలిక్కి రాకపోతే అప్పుడు విషయం కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పైకి అలయ్ బలయ్‌గానే ఉంటున్నారు. జగన్ సీఎం అయిన కొద్ది నెలల వరకు వీరు బాగానే ఉన్నారు. ఆ తర్వాత నీటి సమస్యలతో పాటు ఇతర సమస్యల్లో వీరిద్దరి మధ్య గ్యాప్ క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. రాజకీయ పరమైన అంశాల నేపథ్యంలో వీరు రాజీపడకపోవడంతో అంతర్గతంగా పెద్ద యుద్ధమే నడుస్తోంది. ఈ గ్యాప్‌నే కేంద్రం అలుసుగా చేసుకుని ఈ వివాదం పరిష్కారం కాకుండా ఉండేలా కాలయాపన చేస్తూ వస్తుంది. చివరకు పదేళ్ల తర్వాత దానిని కూడా బీజేపీ ప్రభుత్వం రాజకీయంగా వాడుకునేలా ఉన్నట్టే ఉంది.

# పరిషత్ లెక్కలు తారుమారేనా



నెల్లూరు, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన టీడీపీ ఎన్నికల బహిష్కరణ అంశం.. చంద్రబాబు వేసిన ఎత్తుగడేనా ? తన పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకొంటోందని, ఎన్నికలను బహిష్కరిస్తోందని ఆయన చేసిన ప్రకటన వెనుక చాలా వ్యూహం దాగి ఉందా? అంటే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం టీడీపీపై ప్రజల్లో సింపతీ పవనాలు అడు గంటాయి. నిజానికి చంద్రబాబు రాజకీయాల్లో నమ్ముకున్నది రెండే రెండు అంశాలు. ఒకటి సీనియర్లు, రెండు సింపతీ. సీనియర్లు ఎప్పుడో చేతులు ఎత్తేశారు. ఇదే 2019లో పార్టీని ఘోరంగా దెబ్బతినేలా చేసింది. జనాల్లో ఫేడవుట్ అయిపోయిన సీనియర్ల సలహాలనే నమ్ముకున్న చంద్రబాబు చివరకు తాను కూడా ఫేడవుట్ అవ్వాల్సిన పరిస్థితి. ఇక, సింపతీ కూడా అప్పట్లో వర్కవుట్ కాలేదు. నాకు అన్నీ ఉన్నాయ్. అయినా.. మీ కోసం రోడ్డు మీదకు వచ్చాను నేరస్తులతో (జగన్ పార్టీ) పోటీ చేస్తున్నాను. అంతా మీకోసం.. అన్నీ మీ కోసం" అంటూ.. ఆయన చేసిన ప్రకటన కూడా వర్కువుట్ కాలేదు. అయినప్పటికీ.. ఇప్పటికీ ఆయన సింపతీనే నమ్ముకున్నారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ సింపతీనే నమ్ముకున్నారు. ఇదీ వర్కవుట్ కాలేదు. అయితే.. ఈ సింపతీలోనే రెండో కోణాన్ని తెరమీదికి తెచ్చారు. అదే ఎన్నికల బహిష్కరణ. ఇప్పుడు నిజంగానే చంద్రబాబు చేసిన ప్రయత్నం.. మేధావి వర్గాల్లోనూ చర్చకు వచ్చింది. ఎందుకు ఆయన పోటీ నుంచి తప్పుకొన్నారు ? అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దీంతో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు.. అధికార దుర్వినియోగం వంటివి మేధావి వర్గాల మధ్య చర్చ నడుస్తున్నాయి. ఇదే విషయం సోషల్ మీడియాలోనూ ప్రధానంగా చర్చకు వస్తోంది. గతంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కూడా ఎన్నికలను బహిష్కరించి ప్రజల్లోకి వెళ్లి సింపతీ పొందారు. ఇదే సూత్రాన్ని చంద్రబాబు ఎత్తుకున్నారు. దీంతో వచ్చే ఎన్నికల నాటికి పార్టీ పుంజుకుంటుందని.. ఆయన భావిస్తున్నారు. అదే సమయంలో పార్టీలో నైరాశ్యం ఏర్పడిన నేపథ్యంలో నేతలను దారిలోకి తెచ్చుకునేందుకు కూడా ఇది పనిచేస్తుందని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే బహిష్కరణ సింపతీని చంద్రబాబు ఎంచుకుని ఉంటారని అంటున్నారు. మరి ఇది వర్కవుట్ అయితే.. మంచిదే.. లేకపోతే.. మాత్రం మొదటికే మోసం వస్తుందని అంటున్నారు పరిశీలకులు. ఇప్పటికే పతనావస్థలో పార్టీని మరింత పాతాళంలోకి నెట్టేసినట్టే అవుతుంది.

# భయాందోళనలో ప్రజలు



దేశంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వారి భయం కరోనా పెరిగిపోతుందేమోనని కాదు. సంచలన, అనూహ్య నిర్ణయాలు తీసుకోవడంలో ప్రదాని మోడీ రికార్డే వేరు. కేసులు, మరణాల సంఖ్యను సాకుగా చూపి మళ్లీ దేశంలో లాక్ డౌన్ విధిస్తారేమోననేది వారి భయం. గతంలో లాక్ డౌన్ విధించి కరోనాను కట్టడి చేశామని ప్రభుత్వాలు జబ్బలు చరుచుకున్నాయి. కానీ ఆకలిదప్పులతో ఎన్ని వేలమంది ప్రాణాలు కోల్పోయారో లెక్కలేదు. ఉపాధి లేక అప్పుల ఊబిలో తల ఎత్తుకోలేక ఎంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారో లెక్కలు లేవు. యూనివర్శల్ వాక్సినేషన్ పై శ్రద్ధ పెట్టాల్సిన ప్రభుత్వాలు ఎన్నికలలో బిజీ అయిపోతున్నాయి. కరోనా కట్టడి తూతూ మంత్రంగా సాగుతోంది. కరోనా కట్టడి నిధి 35 వేల కోట్లు కేంద్ర ఖాతాలోనే మూలుగుతోంది. పెట్రోలు, డీజెల్ పై విధించిన అదనపు పన్నులూ సర్కారీ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నాయి. కానీ రోజువారీ కష్టపడి ఉపాధి పొందేవాడి కడుపు మాత్రం ఖాళీగా ఉంది. చేసిన అప్పులు తీర్చలేక వెతలు పడుతున్నాడు. ఈ స్థితిలో కరోనా పెరిగిందని మరోసారి లాక్ డౌన్ విధిస్తే వారి బ్రతుకు దుర్భరమే. కుంభమేళాలు, ఎన్నికల ఉత్సవాలు, మద్య విక్రయాలతో బారత్ ను పరిపుష్టం చేయడం మానుకుంటే కరోనా విజ్రుంభణ కొంతవరకూ తగ్గే అవకాశం ఉంటుంది. అక్కడ మాత్రం ప్రభుత్వాలు స్వేచ్ఛ కల్పించి , లాక్ డౌన్ ల రూపంలో సామాన్యుడి కడుపుపై కొట్టే చర్యలు తీసుకోవద్దని యావత్ భారతావని కోరుకుంటోంది. భారత దేశంలో ప్రాణాలకు విలువ లేదు. మత విశ్వాసాలు, భావోద్వేగాలు, రాజకీయాలు రాజ్యం చేస్తుంటాయి. పర్వదినాల్లో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తుంటారు. ఆ దేవుళ్లు కేవలం సందర్శనకు మాత్రమే తప్ప వరాలు ఇవ్వరనేది ప్రతీతి. దేశంలో చట్టాలు అదే విధంగా ఉత్సవ విగ్రహంగా మారిపోతున్నాయి. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నాయకులు అధికారం కోసం పడే ఆరాటంలో, చేసే పోరాటంలో అర శాతమైనా ప్రజలకోసం వెచ్చించడం లేదు. ఆలోచించడం లేదు. ఫలితంగానే రెండు లక్షల చేరువలో రోజువారీ కరోనా కేసులు, వెయ్యి కి దరిదాపుల్లో మరణాలకు చేరిపోయాం. ఇదంతా ప్రభుత్వం నియంత్రణ పగ్గాలు వదిలేసిన పాపమే. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల తరహాలో భారత ప్రజలు క్రమశిక్షణ కలిగిన పౌరులు కాదు. తొలి నుంచి రాజకీయ వ్యవస్థ వారిని ఆ విధంగా తయారు చేసింది. చట్టం, నిర్బంధం ఉన్నప్పుడు మాత్రమే వారు కొంతమేరకు అదుపులో ఉంటారు. ఉత్సవాలు, ఎన్నికలు, సభలు, సమావేశాలు, వేడుకలకు ప్రభుత్వాలు పచ్చ జెండా ఊపడంతోనే దేశంలో మరోసారి కరోనా విజృంభణకు అవకాశం ఏర్పడింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటామన్న చందంగా ఇప్పటికీ ప్రభుత్వాలు బ్రేకులు వేసేందుకు సిద్దం కావడం లేదు. ఉత్సవాలు, ప్రజాసమూహాలు గుమికూడే వేడుకలు, ఎన్నికల వంటి అంశాల్లో యథేచ్ఛగా స్వేచ్ఛనిస్తున్నారు. తమకు కావాల్సింది ఓట్లే తప్ప ప్రజల ప్రాణాలు కాదని నాయకులు తమ చేతలతో తేల్చి చెప్పేస్తున్నారు. తాము ప్రాధాన్యమిచ్చేది మత పరమైన సెంటిమెంట్లకే తప్ప ప్రజారోగ్యానికి కాదనీ నిరూపిస్తున్నారు. బారత్ లో గడచిన ఏడాది రెండు నెలలకు పైగా కొనసాగిన లాక్ డౌన్లతో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిపోయింది. దిగువ మధ్యతరగతి ప్రజలు పేదరికంలోకి జారిపోయారు. ప్రభుత్వం చాలా కఠినంగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంది. ఉపాధి కోల్పోతున్నా ప్రజలు సహకరించారు. ప్రజల ఆదాయం , జీవన భృతి పక్కనపెట్టిన సర్కారులు తమ ఆదాయానికి మొదటి పీట వేసుకున్నాయి. నియంత్రణలు సడలించిన తొలిరంగాల్లో మద్యం విక్రయాలకు అనుమతులిచ్చాయి. కరోనా కట్టడిపై ప్రభుత్వాల చిత్తశుద్ధి ఆనాడే వెల్లడైంది. తాజాగా కూడా రెండో విడత కరోనా విజృంభిస్తుంటే పాఠశాలలపై ఆంక్షలు పెడుతున్నారు. మద్యం షాపులు, బార్లను యథేచ్ఛగా నడుపుతున్నారు. ఉత్తరాఖండ్ వంటి చోట్ల కుంభమేళాలకు అనుమతిచ్చేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాది మందికి వ్యాధి సోకే ప్రమాదం ఏర్పడింది. వారంతా కరోనా రాయబారులుగా మళ్లీ దేశ వ్యాప్తంగా ఈ రోగాన్ని పంపిణీ చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతమున్న విపత్కర పరిస్థితులలో ఏ కారణాలతో అనుమతినిచ్చారో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. దేశంలో ఇంకా ఒక శాతం ప్రజలకు కూడా టీకాలు వేయలేదు. రెండో విడత కరోనా పెరుగుతోంది. అయినా లక్షల ప్రజలు ఒక చోట గుమికూడి సామూహిక స్నానాలకు దిగుతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని మించిన బాధ్యతారాహిత్యం మరొకటి ఉండదు. ప్రపంచంలో ఎక్కడా లేని వింత ఇది. వ్యాధిని అదుపు చేసే చర్యలు అంతంతమాత్రం. టీకాలు తగినన్ని లేవు. సామూహిక టీకా కార్యక్రమం పూర్తయ్యేందుకు రెండు సంవత్సరాలు పడుతుందని అంచనా. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేశ నవనాడులు కుంగిపోయేలా ఉత్పాతాల వంటి ఉత్సవాలను ప్రోత్సహించడమేమిటో ఎవరికీ అర్థం కాదు. ప్రజల్లో ప్రజాస్వామ్యం అంటే విపరీతమైన గౌరవం ఏమీ లేదు. తమకు వచ్చే సంక్షేమ పథకాలు, తమ ఓట్లకు వచ్చే నోట్లపైన శ్రద్ధ పెరిగింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పథకాలు, పాలన తీరులో పెద్దగా మార్పులు లేవు. పథకాల పేరిట నిధులను పంచి పెట్టడమే . ప్రపంచం కనివినీ ఎరుగని రోగంతో బాధ పడుతున్నప్పుడు ఎన్నికల వంటి వాటిని వాయిదా వేస్తే కొంపలేమీ అంటుకుపోవు. అవసరమైతే రాష్ట్రపతి పాలనలో పెట్టవచ్చు. లేదంటే ఆపద్ధర్మ ముఖ్యమంత్రులుగా ప్రస్తుతమున్న పాలక వర్గాన్ని కొంతకాలం కొనసాగించవచ్చు. నూతన పథకాలతో ప్రజలకు వల వేయకుండా నిరోధించవచ్చు. పార్లమెంటు ఈ విపత్కాలంలో అవసరమైన చట్టం చేసి ఎన్నికల వంటి సామూహిక ఉపద్రవ ఘట్టాల నుంచి దేశానికి ఒక ఏడాదిపాటు వెసులుబాటు కల్పించవచ్చు. వాటన్నిటినీ వదిలేసి లక్షలాది మంది ప్రజలతో ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. నిజానికి ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి జరుగుతున్నట్లుగా కనిపించడం లేదు. పరోక్షంగా ప్రజల ప్రాణాలను అభద్రతలో నెట్టేసేందుకు పార్టీల కుట్రగా కనిపిస్తోంది. దేశంలో హెల్త్ ఎమర్జన్సీ వాతావరణం నెలకొని ఉంది. ప్రాణాలు కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం. ప్రాణాలకంటే విలువైనది ఏమీ ఉండదు. ప్రజాస్వామ్యాన్ని కొనసాగించడానికి ప్రత్యామ్నాయ పద్ధతులూ మనవద్ద ఉన్నాయి. వాటిని వినియోగించకుండా ముప్పు తెచ్చిపెట్టాయి ప్రభుత్వాలు,. ఎన్నికల సంఘాలు. స్థానిక ఎన్నికలు, శాసనసభల ఎన్నికలు, ఉప ఎన్నికలు అంటూ గడచిన రెండు నెలలుగా దేశంలో చాలా రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం కరోనా వైరస్ ను మించి వ్యాపించి పోయింది.

## ఆరోగ్య రంగంలో సేవలందించడం అభినందనీయం





అనంతపురం, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:లయన్స్ క్లబ్ అనంతపురం ఎలైట్ మరియు వేద ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ కార్యాలయం లో ఉచిత మెగా వైద్య శిబిరం 18-04-2021 న జరిగింది. ఈ కార్యక్రమాన్ని భారత్ పెట్రోల్ పంప్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీ యం . విరూపాక్ష రెడ్డి మరియు చార్టర్ ప్రెసిడెంట్ తాడికొండ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి కిమ్స్ సవేరా వైద్యుల ఆధ్వర్యంలో గుండె మరియు ఆర్థోపెడిక్ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలలో అనుభవం కలిగిన వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టరు రాజేష్ గౌడు, ఆర్థోపెడిక్ డాక్టరు ప్రదీప్, మేనేజరు నరేంద్ర మరియు డాక్టర్ యం సురేష్ బాబు తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు. జి.ఆర్.బి.ఎస్ , 2డి, ఇసిజి , బి.పీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి రోగుల సందేహాలను నివృత్తి చేసారు. దాదాపు 150 మంది హృద్రోగులు, మరియు ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు . ఉత్తమ పౌర సమాజమే లక్షంగా లయన్స్ క్లబ్ అనంతపురం ఎలైట్ పనిచేస్తుందని క్లబ్ ప్రధాన కార్యదర్శి వైష్ణవ శ్రీనాథ్, కోశాధికారి బాయినేని నాగేంద్ర ప్రసాద్, శ్రీ నాగేశ్వర రెడ్డి మరియు బి. పృథ్వి తెలిపారు. కరోనా సెకండ్ వేవ్ ఉధృతి తగ్గించేందుకు ప్రభుత్వం మరియు ప్రజా సంఘాల పాత్ర కీలకం అని అధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. విద్య, ఆరోగ్యం, ఆహారం, మహిళా సాధికారత, పర్యావరణం మరియు మానవ విలువలు పై క్లబ్ కార్యక్రమాలు రూపొందించినట్లు ఇంజినీర్ శ్యామ్, సురేష్ బాబు, టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్, జాప్ ప్రధాన కార్యదర్శి పయ్యావుల ప్రవీణ్, ముస్లిమ్ మైనారిటీ డెవలప్మెంట్ శ్రీ ఇమామ్, బి.సి యువ నాయకులు ఎస్. లోకేష్ బాబు, వేద ఇన్ఫ్రా డైరెక్టర్ దేవి రమణ ప్రియ, గౌతమ బుద్ధా డెవలప్మెంట్ సొసైటీ నిర్వాహకులు పద్మావతి, గంగా దేవి,వి . సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## వాణిజ్య పన్నుల శాఖలో కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్19 : ఆటో నగర్ సమీపంలో లో ఎస్సీ ,ఎస్టీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం గా జరిగింది.వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ కార్యాలయం ఎదురుగా కాన్ఫరెన్స్ హాల్ లో సుమారు 175 మంది ఉద్యోగుల సమక్షంలో నామినేషన్ల పర్వం కొనసాగింది ఎన్నికల అధికారి బి బాబు మోహన్ సిహెచ్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో 14 మంది అన్ని పోస్టులకు ఏకగ్రీవంగా ఉద్యోగస్తులు ఎన్నుకున్నారని సమాచారం తెలిపారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్కరు చొప్పున నామినేషన్ వేయగా పోటీ చేసేందుకు ఎవరు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక అవటంతో 14 మందిని ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించి 1.( ప్రెసిడెంట్ టీవీ .సాగర్ )(సెక్రటరీ టీవీ రామారావు)



(అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం జయ రాజేశ్వరరావు) (ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రమేష్)( వైస్ ప్రెసిడెంట్లు. పి మోహన్ దాస్ ,వి రాంబాబు,ఎం రాజేష్, వి .అజయ్ కుమార్ (ట్రెజరర్ ఏ. రవి )(జాయింట్ సెక్రెటరీసు....( మాణిక్యాలరావు సిహెచ్ .మమత ఆర్. రమేష్, టివి నాగార్జున (లేడీ రిప్రజెంటేటివ్ బి. సునీత )వీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో నియామక పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో రామస్వామి, బి.జయ పాల్, బుచ్చిబాబు, రాష్ట్ర కార్యదర్శి ఏడుకొండలు మరియు కత్తి శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు కరోనా

### ఎయిమ్స్‌కి తరలింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:భారత మాజీ ప్రధాన మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ కరోనా బారిన పడ్డారు. ఆయనకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వెంటనే ఢిల్లీ ఎయిమ్స్‌కి తరలించారు. కరోనా సెకండ్ వేవ్ నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించాలని కోరుతూ ఆదివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. వ్యాక్సినేషన్ మాత్రమే కరోనా కట్టడికి ప్రధాన ఆయుధమన్న మన్మోహన్.. వ్యాక్సినేషన్ అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలని కోరారు.

## సీమెన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో 7 రోజుల ఉచిత శిక్షణ



వేటపాలెం, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి, : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాలలోని ఎపియస్‌యస్‌డిసి సీమెన్స్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ నందు ఆధునిక వ్యవసాయ పనిముట్లు మరియు వెల్డింగ్ పై 7 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభించినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవి కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యములో సీమెన్స్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ నందు ఉమ్మిటి శివయ్య ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, దేశాయిపేట విద్యార్థులకు సోమవారం నుండి శనివారము వరకు ఉచిత శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సు నందు యం.యం.వి ట్రెడ్ మరియు ఫిట్టర్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు మాన్యుఫాక్చరిగ్ వెల్డింగ్ మరియు అగ్రికల్చర్ ఫార్మ్ ఎక్విటప్ మెంట్ పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమములో పాల్గొంటున్న విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణా కార్యక్రమమును విజయవంతము చేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమము గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగకరమైనదని, వారు శిక్షణ పొంది పారిశ్రామిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమములో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ యస్.పి.ఒ.సి డాక్టర్ యస్. ఇంద్రనీల్, ఐ.ఐ.టి. కు చెందిన ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీ కె.వి. సుబ్బారావు పాల్గొన్నారు.

## పార్టీపై పట్టు సడులుతోందా...?

విజయవాడ, ఏప్రిల్ 19, ప్రజాపాలన ప్రతినిధి:నిజం చంద్రబాబు పార్టీపై పట్టుకోల్పోతున్నట్లే కన్పిస్తుంది. గత రెండేళ్ల నుంచి నేతలతో పాటు క్యాడర్ కూడా సహకరించకపోవడమే ఇందుకు ఉదాహరణ. చంద్రబాబు నాయుడు అనుకోని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి అయ్యారు. పార్టీ పగ్గాలు చేపట్టారు. అయితే తన వ్యూహాలు సక్సెస్ అయిన వేళ ఆయనను నేతలు విశ్వసించారు. ఏమాత్రం వర్క్ అవుట్ కాకపోతే వెంటనే పార్టీలో ఇబ్బంది కర పరిస్థితులు ఏర్పడ్డాయి.చంద్రబాబు నాయుడు 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజారాజ్యం పార్టీ రావడం, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ నేతృత్వం వహిస్తుండటంతో అప్పటి వరకూ వెన్నంటి ఉన్న నేతలు అనేక మంది పార్టీని వీడిపోయారు. మైసూరా రెడ్డి, సి.రామచంద్రయ్య, తమ్మినేని సీతారాం, దాడి వీరభద్రరావు, కళా వెంకట్రావు ఇలా ఆయన గట్టిగా నమ్ముకున్న నేతలు చంద్రబాబును మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు.ఇక 2019 ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబును సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ లాంటి వారు పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఈ రాజీనామాలు చంద్రబాబుకు తెలిసే జరిగాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళ్లాయి. ఇక తర్వాత తోట త్రిమూర్తులు లాంటి వాళ్లు సయితం తమ దారి తాము చూసుకున్నారు. చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసి విజయం సాధించలేరన్న నమ్మకం తెలుగుదేశం పార్టీ నేతల్లో ఉంది.అందుకే వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే విజయం దక్కదని సీనియర్ నేతలు సయితం అంగీకరిస్తున్నారు. అందుకే మొహం చాటేస్తున్నారు. సీనియర్ నేతలు సయితం పార్టీకి దూరంగా ఉంటున్నారు. దీనికి ప్రధాన కారణం చంద్రబాబుపై నమ్మకం లేకపోవడమే. రానున్న కాలంలో మరింత మంది నేతలు చంద్రబాబును వీడే అవకాశముందంటున్నారు. ప్రజల్లో కూడా చంద్రబాబుకు విశ్వసనీయత లేదని గుర్తించిన నేతలు తమ దారి తాము చూసుకుంటున్నారు. చంద్రబాబుకు రానున్న కాలంలో షాక్ లు తప్పవంటున్నారు.



# మాల్దీవులకు పయనమైన స్టార్ కపుల్..!




బాలీవుడ్ స్టార్ లవ్ కపుల్ రన్బీర్ కపూర్ అలియా భట్ ఈరోజు హాలీడే స్పాట్ మాల్దీవులకు బయలుదేరారు. ఈ మధ్యకాలంలో స్టార్ సెలబ్రిటీలకు మాల్దీవ్స్ అనేది మోస్ట్ ఫేవరేట్ అయిపోయింది. అందుకే ఒకరి తర్వాత ఒకరు మెల్లగా మాల్దీవ్స్ బాటపడుతున్నారు. తాజాగా రన్బీర్ కపూర్ అలియా భట్ ఇద్దరూ కూడా లగేజ్ తో పాటు మాల్దీవ్స్ కు ప్రయాణమైనట్లు విమానాశ్రయంలో కనిపించారు. ఆ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే వీరిద్దరూ కూడా కరోనా బారినపడి కోలుకున్నారు. మార్చ్ నెలలో రన్బీర్ కరోనా పాజిటివ్ కాగా.. ఇటీవలే అలియా పాజిటివ్ రావడంతో హోమ్ క్వారంటైన్ లో ఉన్నారు. ఇప్పుడు ఇద్దరికీ కరోనా నెగటివ్ రావడంతో పాటు ముంబైలో ప్రస్తుతం వైరస్ వణుకు పుట్టిస్తుండటంతో ఈ ప్రేమికులు ఇద్దరూ మాల్దీవులకు పయనమయ్యారు. ఈ స్టార్స్ ఇద్దరూ మూడేళ్లుగా డేటింగ్ లో ఉన్నారు. నిజానికి కరోనా లేకపోతే ఈపాటికి రన్బీర్ - అలియా మ్యారేజ్ అయిపోయేది. ఇటీవలే యంగ్ కపుల్ టైగర్ ష్రాఫ్ - దిశా పటాని మాల్దీవ్స్ కు వెళ్లారు. అంతకుముందు కుర్రహీరోయిన్ సారా అలీఖాన్ తన తల్లి అమృతతో కలిసి వెళ్ళింది. అయితే కరోనా క్వారంటైన్ సమయంలో రన్బీర్ - అలియా ఇద్దరూ ఒకరినొకరు బాగా మిస్ అయ్యారట. అందుకే ఇప్పుడు ఇలా హాలీడే ట్రిప్ కు వెళుతున్నారని టాక్. ఇదిలా ఉండగా త్వరలోనే వీరిద్దరూ కలిసి నటించిన బ్రహ్మాస్త్ర మూవీ విడుదలకు రెడీ అవుతోంది.

## ఎన్టీఆర్ చెప్పాక...కొరటాల కాదంటాడా?



2016లో వచ్చిన 'జనతా గ్యారేజ్' పెద్ద హిట్ అవటంతో ఆ కాంబినేషన్ ఎప్పుడు రిపీట్ అవుతుందా అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆ టైమ్ వచ్చేసింది. అయితే సరిగ్గా ఐదేళ్ల గ్యాప్ తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పని చేయటానికి సిద్ధపడుతున్నారు. ఈ విషయాన్ని కొరటాల శివ సోమవారం అధికారికంగా ప్రకటించాడు. అలాగే ఇది తారక్కు 30వ సినిమా. ఈ చిత్రం షూటింగ్ అయినా మొదలు పెట్టకముందే రిలీజ్ డేట్ కూడా ప్రకటించి ఫ్యాన్స్ను సర్ప్రైజ్ చేశాడు దర్శకుడు. అంతవరకూ బాగానే ఉంది. అయితే ఇప్పుడు ఈ సినిమా టెక్నీషియన్స్ ఎంపిక మొదలైంది. ఈ క్రమంలో కొరటాల పంపిన లిస్ట్ లో కొన్ని మార్పులు చేసారట ఎన్టీఆర్. ముఖ్యంగా మ్యూజిక్ డైరక్టర్ విషయంలో అని తెలుస్తోంది. కొరటాల ప్రస్తుతం ఆచార్య చిత్రం కోసం మణిశర్మతో కలిసి పనిచేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఓ పాట బయిటకు వచ్చి చార్ట్ బస్టర్ గా నిలిచింది. దాంతో కొరటాలకు మణిశర్మని ఎన్టీఆర్ సినిమాకు రిపీట్ చేద్దామనుకున్నారట. కానీ ఎన్టీఆర్ మాత్రం దేవిశ్రీప్రసాద్ వైపే మొగ్గు చూపుతున్నారట. తమ కాంబినేషన్ లో వచ్చి హిట్టైన 'జనతా గ్యారేజ్' కు దేవినే సంగీతం అందించారు. ఆ పాటలన్నీ సూపర్ హిట్. ఇప్పుడు కూడా అదే కాంబినేషన్ లో చేస్తే మ్యూజికల్ గా పెద్ద హిట్ అవుతుంది. సెంటిమెంట్ పరంగా కూడా కలిసొస్తుంది అని ఎన్టీఆర్ ఆలోచన. కొరటాల కూడా ఈ సూచనను అంగీకరించే అవకాసం ఉంది కానీ మణిశర్మతో మళ్లీ సినిమా చేస్తానని మాట ఇచ్చారట. అయితే ఆ తర్వాత సినిమాకు చేద్దాము అని మణిశర్మకు చెప్పి దేవితో వెళ్తాడనే అంటున్నారు. ఎందుకంటే హీరో ప్రత్యేకించి చెప్పాక డైరక్టర్ కాదనేదేముంటుంది అంటున్నారు సినీ జనం. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 29న సినిమాను థియేటర్లలో వదులుతామని వెల్లడించారు కొరటాల. 'ఇంతకుముందు లోకల్ రిపేరింగ్స్ మాత్రమే చేశాం.. కానీ ఈసారి దాని సరిహద్దులు చెరిపేస్తాం..' అని చెప్పుకొచ్చాడు శివ. దీనిపై ఎన్టీఆర్ స్పందిస్తూ.. మరోసారి కొరటాలతో కలిసి పని చేయడం సంతోషంగా ఉందని వెల్లడించాడు. ఈ సినిమా ను తారక్ సోదరుడు నందమూరి కల్యాణ్రామ్ సమర్పిస్తున్నాడు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత జూనియర్ ఎన్టీఆర్ 'ఆచార్య' తరువాత కొరటాల కలసి ఈ కొత్త సినిమా చేస్తారు.

## అఖిల్ తరువాత సినిమాల పై ఇంట్రెస్టింగ్ బజ్ !




అక్కినేని అఖిల్ - పూజా హెగ్డే కలయికలో వస్తోన్న 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' సినిమా పై అక్కినేని అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. అయితే అఖిల్ చేస్తోన్న తరువాత సినిమాల పై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి క్రియేట్ అవుతుంది. ఇప్పటికే 'ఏజెంట్' పేరుతో భారీ బడ్జెట్ స్పై థ్రిల్లర్ ను స్టార్ డైరెక్టర్ సురేందర్ రెడ్డితో చేయబోతున్నట్లు అఖిల్ ఇప్పటికే ప్రకటించాడు. ఈ ఏడాది క్రిస్మస్ సీజన్ లో ఈ చిత్రం తెరపైకి వెళ్లనుంది. ఇప్పుడు, ఫిల్మ్ సర్కిల్స్ లో అఖిల్ సినిమాకి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త ఒకటి వినిపిస్తోంది. అఖిల్ వచ్చే ఏడాది ప్రముఖ ఫిల్మ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో అజయ్ భూపతి దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడట. ఇక 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రావడానికి సన్నద్ధం అవుతోన్న ఈ సినిమా ఇప్పటికే అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని.. ఫస్ట్ కాపీతో రెడీగా ఉంది. అయితే రిలీజ్ డేట్ ను మేకర్స్ మార్చేలా కనిపిస్తున్నారు. కాగా బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్ట్ చేస్తోన్న ఈ సినిమాలో లవ్ ట్రాక్ చాల బాగా వచ్చిందని.. ముఖ్యంగా లవ్ సీన్స్ లో అఖిల్ %--% పూజా హెగ్డే మధ్య కెమిస్ట్రీ చాల బాగా కుదిరిందని.. వీరి మధ్య రొమాన్స్ కూడా సినిమాలోనే హైలెట్ గా నిలుస్తోందని తెలుస్తోంది. అల్లు అరవింద్ సమర్పిస్తున్న ఈ సినిమాను బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా అఖిల్ కెరీర్ కి కీలకం కానుంది.

## 'సుకుమార్-విజయ్' ప్రాజెక్ట్ పై మేకర్స్ క్లారిటీ..!



సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ - డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో ఓ చిత్రాన్ని అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఫాల్కన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1 గా కేదార్ సెలగం శెట్టి ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో పాన్ ఇండియా వైడ్ రూపొందనున్న ఈ సినిమాపైసినిమాపై ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అల్లు అర్జున్ తో ప్రస్తుతం 'పుష్ప' సినిమా చేస్తున్న సుకుమార్.. ఇది పూర్తి చేసిన వెంటనే విజయ్ సినిమా మీద వర్క్ స్టార్ట్ చేస్తారని అందరూ భావించారు. అయితే గత రెండు రోజుల నుంచి 'సుకుమార్-విజయ్' సినిమా ఇప్పట్లో ఉండకపోవచ్చని.. సుక్కూ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో ఓ సినిమా చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని రూమర్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఫాల్కన్ క్రియేషన్స్ టీమ్ ఈ వార్తలను ఖండిస్తూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. డైరెక్టర్ సుకుమార్ - హీరో విజయ్ దేవరకొండ కమిట్మెంట్స్ పూర్తైన వెంటనే ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ స్టార్ట్ అవుతుందని మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో 2022 లోనే ఈ సినిమా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు. "ఫాల్కన్ క్రియేషన్స్ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరో విజయ్ దేవరకొండతో కలిసి ప్రతిష్టాత్మక తొలి ప్రాజెక్టును ప్రకటించింది. హీరో మరియు డైరెక్టర్ కమిట్మెంట్స్ పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం ప్రారంభమవుతుంది. కొన్ని విభాగాలు స్ప్రెడ్ చేస్తున్న తప్పుడు వార్తలను నమ్మవద్దు. ఇలాంటి గాసిప్ లను తప్పుడు ప్రచారాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. 'సుకుమార్-%ఎణ%-ఫాల్కన్' కలయిక బిగ్గర్ గా ఉండబోతోంది. ఇందులో ఎలాంటి మార్పు లేదు" అని ఫాల్కన్ టీమ్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎమోషనల్ సిరీస్ లో సీనియర్ హీరోయిన్స్ !



సీనియర్ హీరోయిన్ మీనా "కరోలిన్ కామాక్షి" పేరుతో తెరకెక్కిన ఓ వెబ్ సిరీస్ లో నటించిన సంగతి తెలిసిందే. అలాగే మీనా మరో వెబ్ సిరీస్ లో నటించడానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. తమిళ నూతన దర్శకుడు మాధవన్ ఈ వెబ్ సిరీస్ ను డైరెక్ట్ చేస్తాడని.. ఇక ఈ వెబ్ సిరీస్ లో మరో సీనియర్ హీరోయిన్ జయసుధ కూడా నటించనుందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే, జూన్ నుండి ఈ వెబ్ సిరీస్ షూటింగ్ కాగా వయసు అయిపోయిన తల్లి కోసం, భర్తను పిల్లలను వదిలేసి వచ్చి తల్లికి సేవ చేసే ఎమోషనల్ క్యారెక్టర్ కి సంబంధించి ఈ సిరీస్ సాగుతుందని తెలుస్తోంది. ఇక ఈ వెబ్ సిరీస్ లో మీనా పాత్ర చాల ఎమోషనల్ గా ఉండనుందని.. మొత్తానికి ఎమోషనల్ సిరీస్ లో ఈ ఇద్దరు సీనియర్ హీరోయిన్స్ నటించబోతున్నారని తెలుస్తోంది. అన్నట్టు మీనా తమిళంలో ఒక సినిమాతో పాటు ఒక సీరియల్ లో కూడా నటిస్తోంది. అలాగే తెలుగులో కూడా వెంకటేష్ దృశ్యం 2 సినిమాలో కూడా నటిస్తోంది.

## 'సలార్' తో ఆ అపవాదుకు ప్రశాంత్ నీల్ చెక్!

పాన్ ఇండియా సూపర్ స్టార్ గా వరుస సినిమాలతో దూసుకు పోతున్న ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న సినిమాల్లో సలార్ ఒకటి. కేజీఎఫ్ ఫిల్మ్ మేకర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సలార్ సినిమాలో శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. ప్రశాంత్ నీల్ యాక్షన్ సినిమా అంటే హీరోయిన్స్ కు పెద్దగా ప్రాముఖ్యత ఉండదు అనే అభిప్రాయం ఉంటుంది. కాని ఈసారి సలార్ కు తనపై ఉన్న ఆ అపవాదును పోగొట్టుకునేలా ప్రశాంత్ నీల్ హీరోయిన్ ను కాస్త ఎక్కువ సమయం చూపించడంతో పాటు కథలో ప్రాముఖ్యతను కూడా పెంచినట్లుగా తెలుస్తోంది. సలార్ లో శృతి హాసన్ పాత్ర చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. శృతి హాసన్ ను సలార్ లో జర్నలిస్ట్ గా ప్రశాంత్ నీల్ చూపించబోతున్నాడట. జర్నలిస్ట్ గా శృతి హాసన్ చేసే సాహసాలు అన్నీ ఇన్నీ కావంటున్నారు. శృతి హాసన్ తో ఏకంగా స్టంట్స్ ను కూడా దర్శకుడు చేయించబోతున్నట్లుగా తెలుస్తోంది. కేజీఎఫ్ సినిమాలో చూస్తే హీరోయిన్ కు పెద్దగా ప్రాముఖ్యత ఉండదు. కాని సలార్ సినిమాలో మాత్రం శృతి హాసన్ కు ప్రభాస్ కు జోడీగా మంచి అవకాశం దక్కడంతో పాటు నటనకు కూడా ప్రాముఖ్యత ఉన్న పాత్ర లభించడం జరిగిందని అంటున్నారు. ట్యాలెంటెడ్ బ్యూటీగా పేరున్న ఈ అమ్మడికి సలార్ సినిమా ఖచ్చితంగా ఒక ఛాలెంజ్ అనడంలో సందేహం లేదు. ఇటీవలే ప్రభాస్ లేకుండానే సలార్ చిత్రీకరణ జరిగింది. అందులో శృతి హాసన్ పై కీలక యాక్షన్ సన్నివేశంను చిత్రీకరించినట్లుగా చెబుతున్నారు. భారీ బడ్జెట్ తో నిర్మాణం జరుగుతున్న సలార్ సినిమాను వచ్చే ఏడాది ఆరంభంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారీ ఎత్తున అంచనాలున్న సలార్ మూవీ లో ప్రభాస్ లోని మాస్ యాంగిల్ ను పూర్తిగా ప్రశాంత్ నీల్ ఆవిష్కరించబోతున్నాడట.



## డార్లింగ్ క్యాప్ వెనక కథేంటి..??



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా స్ట్రాంగ్ ఫ్యాన్ బేస్ కలిగి ఉన్నాడు. బాహుబలి సినిమా దగ్గరనుండి ప్రభాస్ పాన్ ఇండియా ఏ ీ ా ం ో గ ా కొనసాగుతున్నాడు. ఇప్పుడు అదే రేంజికి తగ్గట్టుగా సినిమాలు చే స ు క ో ు ం టూ ా పోతున్నాడు. బాహుబలి సిరీస్ తర్వాత ప్రభాస్ నుండి సాహో సినిమా వచ్చింది. ఆ సినిమాకు టాక్ నెగటివ్ వచ్చినప్పటికి కలెక్షన్స్ మాత్రం భారీగానే రాబట్టింది. మొత్తానికి సినిమా లాస్ అయితే చేయలేదని తెలిసిందే. అయితే సాహో తర్వాత ప్రభాస్ నుండి రాధేశ్యామ్ సినిమా రాబోతుంది. ఈ సినిమా చివరి షెడ్యూల్ తాజాగా ఫినిష్ చేసాడు ప్రభాస్. ఇదివరకే షూటింగ్ పూర్తయినప్పటికి ఓ పది రోజుల కొరకు ప్రభాస్ ముంబై నుండి హైదరాబాద్ వచ్చాడు. అయితే తాజాగా రాధేశ్యామ్ సినిమా పూర్తి చేసాక ప్రభాస్ నయా లుక్ అందరిని అట్రాక్ట్ చేస్తోంది. అందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్ హెయిర్ క్యాప్ ధరించి కవర్ చేయడంతో అందరికి సందేహాలు మొదలయ్యాయి. మరి ఆ క్యాప్ వెనక కథేంటని అనుకుంటుండగా.. ప్రభాస్ ఏదో న్యూ హెయిర్ స్టైల్ గురించి అలా క్యాప్ అడ్డు పెట్టినట్లు సినీవర్గాలు చెబుతున్నాయి. మరి అసలు కథేంటి అనేది తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే. అయితే పీరియడిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన రాధేశ్యామ్ మూవీ ఈ ఏడాది జులై 30న రిలీజ్ చేయనున్నట్లు ఇదివరకు మేకర్స్ ప్రకటించారు. కానీ ఇప్పుడు ఉన్నటువంటి కరోనా పరిస్థితుల దృష్ట్యా సినిమా వాయిదాపడే అవకాశం కూడా ఉంది. చూడాలి మరి ఏం జరగనుందో.. ఈ సినిమాను రాధాకృష్ణకుమార్ డైరెక్ట్ చేయగా యూవి క్రియేషన్స్ వారు నిర్మించారు. పూజాహెగ్డే హీరోయిన్ గా నటించింది.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com